PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 139 | విజయవాడ, మంగళవారం 20 డిసెంబర్ 2022 | 6+8 పేజీలు వెల : రూ. 5. 50

Vol No | Vijayawada, Tuesday 20 December 2022 | Rs




నేటి నుంచి

'మున్సిపల్ వర్కర్స్' రాష్ట్ర మహాసభ

- ముస్తాబైన అనంతపురం

లోపలి పేజీలో..



లోపలి పేజీలో..

మెస్సీ నయా చరిత్ర

ఫిఫా ప్రపంచకప్ ప్రతి నాకౌట్ మ్యాచులోనూ గోల్

పనిచేసే చోటే నివాసం!

- గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్కారు షరతు?
- సిఎం సమీక్షలో ప్రస్తావన



(ఫైల్)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పనిచేసే సచివాలయల పరిధిలోనే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం అత్యున్నత స్థాయిలో ఈ విషయమై ఇప్పటికే చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ నెల 15న సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చిందని తెలిసింది. ఆ సమావేశానికి రూపొందించిన అజెండాలోనూ ఈ అంశం ఉంది. సచివాలయాల ఏర్పాటులో ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి, రూపొందించిన విధులను నూరు శాతం పూర్తి చేయడానికి పనిచేసే సచివాలయ పరిధిలోనే నివాసం ఉండటం అత్యంత కీలకమన్న అభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమైనట్లు చెబుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో సచివాలయ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఆలోచనపై బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించి రాత పూర్వకంగా ఉత్తర్వులు రాకపోవడంతో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్‌కు సంబంధించిన యాప్ కొత్త వెర్షన్‌ను సోమవారం ప్రభుత్వం విడుదల చేసింది. దీనిలో సచివాలయ పరిధి, డోర్ నెంబర్‌తో సహా పూర్తి చిరునామాను తప్పనిసరిగా నమోదు చేయాల్సిఉంది. గతంలో ఈ తరహాలో యాప్ లేకపోవడం, పనిచేసే చోటే నివాసం ఉండాలన్న చర్చ ప్రారంభమైన తరువాతే చిరునామాకు సంబంధించి పూర్తి వివరాలు నమోదు చేయాలని ఆదేశించడం కూడా సచివాలయ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సచివాలయ సిబ్బందిలో ఎక్కువ మంది వేర్వేరు ప్రాంతాల నుండి విధులకు హాజరవుతున్నారు. పనిచేస్తున్న సచివాలయాల పరిధిలోనే నివాసం ఉండేవారి సంఖ్య చాలా తక్కువ! దీంతో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటోందోనన్న ఆందోళన వీరిలో వ్యక్తమవుతోంది.

ఇప్పుడే ఎందుకు...?

గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు విస్తృతంగా పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అనేక చోట్ల సచివాలయ ఉద్యోగులు స్థానికంగా అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులు వచ్చినట్లు చెబుతున్నారు. ఈ విషయాన్ని వారు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో తాజా ప్రతిపాదన ముందుకు వచ్చి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

స్పందనలో తప్పనిసరి...!

మరోవైపు సచివాలయాల్లో బాధ్యతలు నిర్వహించే ప్రతిఒక్కరూ స్పందన కార్యక్రమంలో భాగస్వాములు కావాల్సిందేనని ప్రభుత్వం ఆదేశించింది. ఫీల్డ్‌స్టాఫ్‌కు కూడా ఈ విషయంలో మినహాయింపు లేదని స్పష్టం చేసింది. మహిళా పోలీసు, విఆర్‌ఓ, గ్రామ సర్వేయరు, ఎనర్జీ అసిస్టెంట్ కూడా ప్రతిరోజూ మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకూ జరిగే స్పందనలో పాల్గొనాల్సిందేనని ప్రభుత్వం పేర్కొంది. వ్యవసాయశాఖ, దాని అనుబంధ రంగాలకు చెందిన కార్యదర్శులు తప్పనిసరిగా సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికెల్లో) పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశించింది.



సిజెఐ చంద్రచూడ్ హయాంలో

6,844 కేసుల పరిష్కారం

న్యూఢిల్లీ : ఇటీవల కాలంలో సుప్రీంకోర్టులో రికార్డు స్థాయిలో కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది నవంబర్ 9న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా డివై చంద్రచూడ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి సుప్రీంకోర్టు 6,844 కేసులను పరిష్కరించింది. ఈ ఒక నెల ఏడు రోజుల వ్యవధిలో సుప్రీంకోర్టులో 5,898 కొత్త కేసులు నమోదయ్యాయి. కొత్త కేసుల కంటే పరిష్కరించిన కేసులు ఎక్కువగా ఉండటం సుప్రీంకోర్టు చరిత్రలో అరుదైన రికార్డుగా భావిస్తున్నారు. చంద్రచూడ్ హయంలో సుప్రీంకోర్టులో కేసుల పరిష్కారంలో వేగం పెరిగింది. నవంబర్ 9 నుంచి డిసెంబరు 16 వరకూ అంటే శీతాకాల సెలవుల ప్రారంభం వరకూ, ఒక రోజులో కనిష్టంగా 90 కేసులను, గరిష్టంగా 277 కేసులను సుప్రీంకోర్టు పరిష్కరించింది. నవంబర్ 9 నుంచి డిసెంబరు 16 వరకూసుప్రీంకోర్టు మొత్తంగా 2,511 ట్రాన్స్‌ఫర్, బెయిల్ పిటిషన్లను పరిష్కరించింది. సుప్రీంకోర్టులోని మొత్తం 13 ధర్మాసనాల్లోనూ పిటీషన్ల విచారణలో వేగం పెరిగింది. చంద్రచూడ్‌కు ముందున్న ప్రధాన న్యాయమూర్తి యుయు లలిత్ పదవీ కాలం 74 రోజుల్లో సుప్రీంకోర్టులో 10 వేలకు పైగా కేసులు పరిష్కారమయ్యాయి.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిఎం జగన్

డ్రగ్స్ రహితంగా రాష్ట్రం

- మాదకద్రవ్యాలను నిర్మూలించండి
- అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వచ్చే మూడు నాలుగు నెలల కాలంలో రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దాలని, మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఎస్‌ఇబి, ఎక్సైజ్‌శాఖపై క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నార్కోటిక్స్, అక్రమమద్యం, సచివాలయాల్లో మహిళా పోలీసుల పనితీరు, దిశచట్టం అమలు తదితర అంశాలపైన సిఎం చర్చించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రతి మంగళవారం సమావేశం నిర్వహించి గంజాయిసాగు నియంత్రణ, ఎక్సైజ్, ఎస్‌ఇబి అధికారులు తీసుకుంటున్న చర్యలపై చర్చించాలన్నారు. ప్రతి గురువారం పోలీసు అధికారులతో సమావేశం కావాలని తెలిపారు. . టోల్‌ఫ్రీ నెంబరు 14500తోపాటు నార్కోటిక్స్ నియంత్రణపై అన్ని కాలేజీలు, యూనివర్శిటీల వద్ద పెద్ద హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు మాదకద్రవ్యాలను అందుబాటులో లేకుండా చూడాలన్నారు . మహిళా పోలీసులు దిశయాప్‌ను ఇంకా పటిష్టం చేయాలని, రాష్ట్రంలో దాదాపు 15 వేలమంది మహిళా పోలీసులు ఉన్నారని, వారి పనితీరు మెరుగుపర్చడంపై దృష్టి సారించాలన్నారు. దేశంలో ఎక్కడా కూడా మన రాష్ట్రంలో ఉన్న మహిళా పోలీసులు లేరని వారిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టాలని తెలిపారు. గంజాయి సాగుదార్లకు వ్యవసాయం, పాడి వంటి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపడం ద్వారా వారికి శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు. అలాగే రాష్ట్రంలో 1.15 లక్షల కుటుంబాలకు 2.82 లక్షల ఎకరాలకు సంబంధించి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చామన్న సిఎం ఆ భూముల అభివృద్ధికి సంబంధించి తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం కె.నారాయణస్వామి, హోంమంత్రి తానేటి వనిత, డిజిపి కె.వి.రజేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ, ప్రొహిబిషన్ ఎక్సైజ్ కమిషనర్ వివేక్‌యాదవ్, ఆదనపు డిజిపి రవిశంకర్, ఎస్ఇబి డైరెక్టర్ రమేష్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

108 ఉద్యోగుల సమ్మె నోటీసు

- సంక్రాంతి తర్వాత దశలవారీ ఆందోళన

లోపలి పేజీలో..

ఆర్‌టిసి స్థలంలో వైసిపి కార్యాలయానికి శంకుస్థాపన

- రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన డిపో మేనేజర్

పోర్టుల ప్రైవేటీకరణ వద్దంటూ ధర్నా

జాతీయస్థాయి క్రీడల్లో రాణించిన రాష్ట్ర పోలీసులు

- డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందనలు

లోపలి పేజీలో..



కర్ణాటక అసెంబ్లీ ఆవరణలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్ణాటక అసెంబ్లీలో సావర్కర్ ఫొటో

- కాంగ్రెస్ ఆందోళన

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు విడి సావర్కర్ ఫొటో ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ ఆందోళన నిర్వహించింది. అసెంబ్లీలో వివాదాస్పద వ్యక్తి ఫొటోను ఆవిష్కరించాల్సిన అవసరం ఏమిటని కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాన్ని నిలదీసింది. అవినీతి, కుంభకోణాలు, రైతు సమస్యలపై చర్చ జరగకుండా చేసేందుకు ఇటువంటి చర్యలు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. బొమ్మై ప్రభుత్వ తీరును నిరసిస్తూ అసెంబ్లీ భవనం ఎదుట కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. సరిహద్దు జిల్లా అయిన బెలగావిలో 10 రోజుల అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల ప్రారంభానికి ముందు శాసనసభలో మహాత్మాగాంధీ, మిగతా 5లో

విభజన సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

- రాజ్యసభలో విజయసాయిరెడ్డి విమర్శ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి ఎనిమిదేళ్లు కావస్తున్నా రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న ఆస్తుల పంపకాల సమస్యను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని వైసిపి పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయి రెడ్డి విమర్శించారు. విభజన చట్టం ప్రకారం న్యాయసమ్మతంగా, ధర్మబద్ధంగా, త్వరితగతిన ఆస్తుల పంపిణీ సమస్యను పరిష్కరించాలని తమ ప్రభుత్వం ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్రం ఏళ్ల తరబడి సాచివేత ధోరణి అనుసరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో విసిగిపోయిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభజన చట్టం ప్రకారం ఆస్తుల పంపిణీ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన దుస్థితి వచ్చిందని చెప్పారు. ఈ పరిస్థితికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే కారణమని అన్నారు. ద్రవ్య వినిమయ బిల్లుపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో విజయసాయి రెడ్డి మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్రాలకు చెల్లించే జిఎస్‌టి పరిహారాన్ని నిలిపివేస్తోందని చెప్పారు. మరోవైపు ఆంధ్రా, తెలంగాణ మధ్య ఆస్తులు, ఆర్థిక వనరుల పంపిణీ సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా కేంద్రం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని చెప్పారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సమస్యలతో సతమతమవుతోందన్నారు.

12 ఏళ్లనాటి ధరలతోనా..?

12 ఏళ్ల క్రితం నిర్ణయించిన ధరలకే పోలవరం పనులు చేయాలన్న నిర్ణయం హాస్యాస్పదంగా ఉందని విజయసాయి అన్నారు. 2010-11 ధరలతో పనులు చేయడానికి ఏ కాంట్రాక్టర్ అయినా ముందుకు వస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఈ విధంగా ప్రతి దశలో ఏదో ఒక మిగతా 5లో

అప్పుల్లో రాష్ట్రానికి ఎనిమిదో స్థానం

రూ.3,98,903.6 కోట్లు రుణం

దేశంలోని అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ ఎనిమిదో స్థానంలో నిలవగా, తెలంగాణ 11వ స్థానంలో నిలిచింది. సోమవారం లోక్‌సభలో టిఆర్‌ఎస్ ఎంపిలు జి.రంజిత్ రెడ్డి, వెంకటేష్ నేత, మాలోతు కవిత అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022 బడ్జెట్ అంచనాల్లో ఎపి అప్పు రూ.3,98,903.6 కోట్లు కాగా, తెలంగాణ అప్పు రూ.3,12,191.3 కోట్లని తెలిపింది. ఏపిలో అప్పు 10.7 శాతం పెరగగా, తెలంగాణ అప్పు 16.7 శాతం పెరిగింది. అప్పుల్లో మొదటి స్థానంలో తమిళనాడు (రూ.6,59,868.9 కోట్లు), రెండో స్థానంలో ఉత్తరప్రదేశ్ (రూ.6,53,307.5 కోట్లు), మూడో స్థానంలో మహారాష్ట్ర (రూ.6,08,999.7 కోట్లు), నాలుగో స్థానంలో పశ్చిమ బెంగాల్ (రూ.5,62,697.2 కోట్లు), ఐదో స్థానంలో రాజస్థాన్ (రూ.4,77,177.2 కోట్లు), ఆరో స్థానంలో కర్ణాటక (రూ.4,61,832.8 కోట్లు), ఏడో స్థానంలో గుజరాత్ (రూ.4,02,785.4 కోట్లు) నిలిచాయి. 2021-22 బడ్జెట్ అంచనాల ప్రకారం అప్పుల పెరుగుదలలో మధ్యప్రదేశ్ (19 శాతం), హర్యానా (18.8 శాతం), అస్సాం (18.7 శాతం), సిక్కిం (18 శాతం), తమిళనాడు (18 శాతం), రాజస్థాన్ (16.8 శాతం), తెలంగాణ (16.7 శాతం), కర్ణాటక (15.1 శాతం), మహారాష్ట్ర (14.8 శాతం), ఛత్తీస్‌గఢ్ (14 శాతం), మిజోరం (13.7 శాతం), త్రిపుర (13.6 శాతం), పశ్చిమ బెంగాల్ (12.1 శాతం), ఉత్తరాఖండ్ (11.6 శాతం), హిమాచల్ ప్రదేశ్ (11.6 శాతం), జార్ఖండ్ (11.6 శాతం), ఆంధ్రప్రదేశ్ (10.7 శాతం), గోవా (10.7 శాతం) ఉన్నాయి.

చెత్త పన్ను కట్టాల్సిందే

- లేకుంటే కుళాయి కనెక్షన్ కట్ చేస్తాం
- బెదిరింపులకు పాల్పడుతున్న కర్నూలు కార్పొరేషన్ సిబ్బంది



దుకాణం ముందు చెత్తవేసిన కార్పొరేషన్ సిబ్బంది (ఫైల్)

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

చెత్త పన్ను వసూలు కోసం కర్నూలు కార్పొరేషన్ వింత పోకడలు అనుసరిస్తోంది. చెత్త పన్ను కట్టకపోతే పింఛన్ రాదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవనీ బెదిరింపులకు పాల్పడుతున్నారు. అవేమీ లేని వారికి కుళాయి కనెక్షన్ కట్ చేస్తాం అంటూ బెదిరిస్తున్నారు. చెత్త పన్ను వసూలు చేసేందుకు తాజాగా నగరంలోని శ్రీరాం నగర్‌కు చెందిన ఓ వ్యక్తి వద్దకు వలంటీర్, శానిటరీ సెక్రటరీ వెళ్లారు. తాను చెత్త పన్ను కట్టనని ఆ వ్యక్తి చెప్పడంతో వారు శానిటరీ ఇన్స్‌పెక్టర్‌కు ఫోన్ చేశారు. ' చెత్త పన్ను కట్టాలని, కట్టకపోతే తాము కుళాయి కనెక్షన్ కట్ చేస్తామని' అతను బెదిరింపులకు పాల్పడ్డారు. నగరంలో ఇలా ఒక్క వ్యక్తినే కాదు చెత్తపన్ను కట్టని వారందరినీ ఏదో ఒక విధంగా కార్పొరేషన్ సిబ్బంది బెదిరిస్తూనే ఉన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటికీ నెలకు రూ.60 చొప్పున చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. దీనిపై మొదటి నుంచి ప్రజలు, ప్రజాసంఘాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉంది. సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ ముట్టడి కూడా చేపట్టారు. అయినా కార్పొరేషన్ అధికారులు పన్ను వసూలు విషయంలో వెనక్కు తగ్గడం లేదు. ఎలాగైనా చెత్త పన్ను వసూలు చేయాలని బెదిరింపు మార్గాన్ని కార్పొరేషన్ సిబ్బంది ఎంచుకున్నారు. చెత్త పన్ను కట్టకపోతే పింఛన్ రాదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవనీ, కుళాయి కనెక్షన్ కట్ చేస్తాం అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. చెత్త పన్ను కట్టలేదని ఓ దుకాణ సముదాయం ముందు గతంలో మున్సిపల్ సిబ్బంది చెత్తను వేశారు. అలాగే నంద్యాల విసి కాలనీలో నివసిస్తున్న దంపతులకు విడివిడిగా చెత్త పన్ను విధిస్తూ నోటీసులు ఇచ్చారు. భర్త పేరిట రూ.120, భార్య పేరిట రూ.60 కట్టాలని అందులో పేర్కొన్నారు. చెత్త పన్ను కట్టకపోతే పెన్షన్ నుంచి మినహాయించుకుని ఇస్తామని చెబుతున్నారని, ఇలా చేయడం వల్ల మాకు మందులకు ఆర్థికంగా ఇబ్బంది అవుతుందని కర్నూలులోని బంగారుపేట చెందిన మాధవీలత ఆవేదన వ్యక్తం చేశారు. 'కార్పొరేషన్ పరిధిలో చాలా మంది చెత్త పన్ను చెల్లించడం లేదు. ఒకసారి కడితే అలవాటు పడతారని, ఒకరిని చూసి మరొకరు పన్ను కడతారని సిబ్బంది అలా చెబుతున్నారని' కర్నూలు కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రమాదేవి చెప్పడం కొసమెరుపు.

చెత్త పన్ను కట్టలేం

కూలీ చేసి బతికేటోళ్లం. రెక్కాడితే గానీ డొక్కాడకుంది. నెలకు రూ.60 చెత్త పన్ను కట్టాలని అంటున్నారు. మేం కట్టలేం. వలంటీర్లు వచ్చి చెత్త పన్ను కట్టాల్సిందే, లేకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు రావని చెబుతున్నారు. ప్రభుత్వం ఓ పక్క సంక్షేమ పథకాలు అందిస్తూనే మళ్లీ మా ద్వారా పన్నులు వసూలు చేయడం సరికాదు.

\- లక్ష్మి, బుధవారపేట, కర్నూలు

జెఇఇ మెయిన్ పరీక్షను వాయిదా వేయండి

- విద్యార్థుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ : జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జెఇఇ)- మెయిన్స్ మొదటి దశ పరీక్షను వాయిదా వేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల డిమాండ్‌తో సోషల్ మీడియాలో 'పోస్ట్‌పోన్ జెఇఇ మెయిన్స్' హాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉంది. ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జెఇఇ మెయిన్ మొదటి దశ జనవరిలో జరుగుతుంది. ఇదే సమయంలో తమ ప్రాక్టికల్ పరీక్షలు కూడా జరుగుతాయనే ఆందోళనను విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జెఇఇ మెయిన్ పరీక్షలు 2023 జనవరి 24 నుంచి 31 వరకూ జరుగుతాయి. సిబిఎస్ఇ 12వ తరగతి పరీక్షలు 2023 ఫిబ్రవరి 15న ప్రారంభమవుతాయి. ప్రాక్టికల్ పరీక్షలు జనవరిలో నిర్వహిస్తారు. ఈ కారణంతోనే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు.

సంక్రాంతికి 6,200 ప్రత్యేక బస్సులు

- అదనపు ఛార్జీలుండవు
- ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రానున్న క్రిస్టమస్, కొత్త సంవత్స రం, సంక్రాంతి పండుగల సందర్భంగా ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. అదనపు ఛార్జీలను వసూలు చేయకుండా సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక సర్వీసులను నడుపుతామని చెప్పారు. సోమవారం విజయవాడ ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మొత్తం 6,400 ప్రత్యేక బస్సులను నడిపేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నామని, తెలంగాణా నుంచి 3,600, కర్నాటక నుంచి 430, చెన్నయ్ నుంచి 150 ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. జనవరి 6 నుంచి 14వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేందుకు, 15 నుంచి 18వ తేదీదాకా తిరిగి వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎవరైనా ప్రయాణంతోపాటు తిరుగు ప్రయాణానికి కూడా ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీని ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇతర జిల్లాల నుంచి విజయవాడకు 800, విశాఖపట్నానికి 450, రాజమండ్రికి 200, ఇతర ప్రాంతాలకు 770 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రయాణికులు తమ సందేహాలను 0866 2570005 నెంబర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని వివరించారు. గత ఏడాది సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులను నడిపితే రికార్డుస్థాయిలో ఆదాయం వచ్చిందని చెప్పారు. ఈ ఏడాదీ అదనపు ఛార్జీలను వసూలు చేయకుండా నడుపుతామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది ఆర్‌టిసి ఆదాయం బాగాపెరిగిందని తెలిపారు. గత ఏడాది మొత్తంగా రూ.3,448 కోట్లు రాగా, ఈ ఏడాది నవంబర్ నాటికే రూ 3,886 కోట్ల ఆదాయం సమకూరిందని వివరించారు. సగటు ఓఆర్ రేటు 63 శాతం నుంచి 68 శాతానికి పెరిగిందని తెలిపారు. ఆర్‌టిసిలో చాలాకాలంగా ఎదురుచూస్తున్న కారుణ్య నియామకాల ప్రక్రియ మొదలైందని, ఇప్పటికే 191 మందికి పోస్టింగులు ఇచ్చామని చెప్పారు. ఆర్‌టిసి ప్రైవేట్‌పరం చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని, ఏ ఒక్క ఉద్యోగినీ తొలగించబోమని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ కోటేశ్వరరావు, సిహెచ్ బ్రహ్మానందరెడ్డి, గిడుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించిన రాష్ట్ర పోలీసులు

- డిజిపి అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన వాలీబాల్, యోగా, సెపక్‌తక్రా క్రీడల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన క్రీడాకారులను డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి అభినందించారు. సోమవారం మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. డిశంబర్ 10 నుండి 15 వరకూ పంజాబ్‌లోని జలంధర్‌లో నిర్వహించిన 71వ జాతీయ స్థాయి వాలీబాల్, యోగా, సెపక్ తక్రా పోటీల్లో దేశంలోని 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలు, సెంట్రల్ పోలీస్ ఆర్గనైజేషన్లకు చెందిన పోలీసు బలగాల నుండి మొత్తం 2,770 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐజి ఎల్‌కెవి రంగారావు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సత్యసాయి జిల్లాలో తను నేసిన చీరతోనే ఆత్మహత్యకు పాల్పడిన చేనేత కార్మికుడు కాలూరి కృష్ణమూర్తి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్‌లో చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరగకూడదంటే పట్టు ధరలను 2021 నాటి ధరలకు తగ్గించాలని కోరారు. జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఆకలి చావులకు, ఆత్మహత్యలకు గురికాకుండా రక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. 2022లో పట్టుధర రూ.3800 నుండి రూ.7000 చేశారని పేర్కొన్నారు. జిఎస్‌టి పట్టుపై ఐదుశాతం, రంగులపై 15 శాతం, రసాయనాలపై 18 శాతం, వస్త్రం తయారైన తరువాత ఐదుశాతం విధించారని తెలిపారు. దీనివల్ల కార్మికులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సత్యసాయి జిల్లాలో కృష్ణమూర్తి కూడా చేసిన అప్పులు తీర్చలేకే ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు.

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం : కాంగ్రెస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిలకు వైసిపి ప్రభుత్వం 27 సంక్షేమ అభివృద్ధి పథకాలను నిలుపు చేసిందని ఎపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జంగా గౌతమ్ తెలిపారు. సోమవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల హక్కుల కోసం దళిత, గిరిజన ఐక్యవేదిక చేపట్టిన పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాల విషయంలో వైసిపి ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని, దళిత, గిరిజన హక్కులు, అభివృద్ధిపై ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించాలని కోరారు. నవరత్నాలు అమలు చేస్తున్నామనే పేరుతో రాజ్యాంగపరంగా ఉండాల్సిన హక్కులన్నీ ఎత్తేస్తున్నారని వివరించారు. ఓట్ల పథకాలుగా వాటిఇ అమలు చేస్తున్నారని వివరించారు. మీడియాలో వచ్చే వార్తలను పట్టించుకోకుండా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. విజయవాడలో విడుదల చేసిన దళిత, గిరిజన డిక్లరేషన్‌ను వైసిపి అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తోందని తెలిపారు. చింతపల్లిలో హైడ్రో పవర్ ప్లాంటుకు వ్యతిరేకంగా పోరాడుతున్న గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలుపుతుందని వివరించారు.

విశాఖలో డ్రోన్ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి

- విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో వ్యవసాయంతోపాటు అనేక రంగాల్లో డ్రోన్ పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న దృష్ట్యా డ్రోన్ టెక్నాలజీపై మరింత విస్తృత పరిశోధనలు జరిపేందుకు విశాఖపట్నంలో జాతీయ స్థాయి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వైసిపి ఎంపి వి.విజయసాయిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో సోమవారం జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. రైతులు దేశ ప్రగతికి తోడ్పడుతున్నందున వారికి ఎంతగానో ఉపకరించే డ్రోన్ల పరిజ్ఞానాన్ని మరింత విస్తృతపరిచేందుకు విశాఖపట్నంలో జాతీయ డ్రోన్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలి

- టిఎస్‌ఎన్‌ఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీసు నియామకాల్లో అభ్యర్థుల వయో పరిమితిని ఐదేళ్లు పెంచాని టిఎస్‌ఎన్‌ఎఫ్ అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని. ప్రతి ఎటా 6,500 పోలీసు ఉద్యోగ నియామకాలు చేపడతామని వైసిపి హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తరువాత దానికి భిన్నంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

ఆర్‌టిసి స్థలంలో వైసిపి కార్యాలయానికి శంకుస్థాపన

- రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసిన డిపో మేనేజర్

ప్రజాశక్తి- యంత్రాంగం



బాపట్లలో జిల్లా వైఎస్‌ఆర్‌సిపి కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కొట్టు సత్యనారాయణ, మేరుగ నాగార్జున

బాపట్ల జిల్లాలో వైసిపి కార్యాలయం స్థలం విషయంలో వివాదం నెలకొంది. ఆర్‌టిసి స్థలంలో వైసిపి కార్యాలయ నిర్మాణానికి సోమవారం మంత్రులు కొట్టు సత్యనారాయణ, మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే కోన రఘుపతి శంకుస్థాపన చేశారు. ఆర్‌టిసి స్థలంలో శంకుస్థాపన చేయడంపై బాపట్ల ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాసరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. డిపో మేనేజర్ వివరణ ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కాలనీ సమీపంలోని ఆర్‌టిసి గ్యారేజీ వెనుక నాలుగు ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలాన్ని భవిష్యత్ అవసరాల కోసం 1990లో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి ఆర్‌టిసి కొనుగోలు చేసింది. దీనికి సమీపంలోనే 216 జాతీయ రహదారి వెళుతుంది. రహదారి సమీపంలో కోట్ల విలువైన భూమిలో వైసిపి జిల్లా కార్యాలయం నిర్మాణానికి రెండు ఎకరాలను 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. కార్యాలయం నిర్మాణానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఈ విషయం గురించి ఆర్‌టిసి అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వమే ఈ స్థలాన్ని లీజుకు ఇచ్చిందని తహశీల్దార్ పేర్కొన్నారు.

1990 నుండి ఆ స్థలం ఆర్‌టిసిదే : ద్వారకా తిరుమలరావు

బాపట్లలో అధికారపార్టీ కార్యాలయం కడుతున్న స్థలం ఆర్‌టిసిదేనని, 1990లోనే ఎపిఐఐసి ఆర్‌టిసికి కేటాయించిందని ఆర్‌టిసి ఎండి ద్వారకా తిరుమలరావు అన్నారు. సోమవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. బాపట్లలో ఆర్‌టిసికి సంబంధించిన స్థలాన్ని ఎపిఐఐసి వెనక్కు తీసుకుని వేరొకరికి కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. దీనిపై విచారణకూ ఆదేశించామని వివరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని అన్నారు. దీనిపై అక్కడ అధికారులు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆర్‌టిసికి సంబంధించిన స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కానివ్వబోమని తెలిపారు.

ఆర్‌టిసి స్థలాన్ని పరిరక్షించాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

బాపట్లలో ఆర్‌టిసికి చెందిన 1.45 ఎకరాల భూమిని వైసిపి జిల్లా కార్యాలయం కోసమని లీజుకు ఇవ్వడం సరైంది కాదని ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ పేర్కొంది.

రాష్ట్రంలో ఆర్‌టిసి స్థలాల పరిరక్షణ కోసం యజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాష, అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి కార్యాలయానికి స్థలాన్ని ఇస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



ఆర్‌టిసి డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

అంతర్జాతీయ క్రీడల్లో రాణించిన ఆర్‌టిసి డ్రైవర్‌కు ఎమ్‌డి అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెయిట్‌లిఫ్టంగ్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో పథకం సాధించిన కాకినాడకు డిపోకు చెందిన ఆర్‌టిసి డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావును ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు అభినందించారు. సంస్థకు గర్వకారణమని పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో మందపల్లి శ్రీనివాసరావును ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్‌డి మాట్లాడుతూ ఎం.శ్రీనివాసరావుకు ఆర్‌టిసి అన్ని విధాలుగా సహకారం వుంటుందని తెలిపారు. భవిష్యత్‌లో ఎక్కడ పోటీలు జరిగినా శ్రీనివాసరావుకు ఆన్‌డ్యూటీ ఇవ్వడంతోపాటు అన్ని విధాలుగా చేయూతనిస్తామని తెలిపారు. అండగా వుంటామని ఎమ్‌డి హామీ ఇవ్వడం పట్ల శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్‌డి ఇచ్చిన సహకారంతో తాను ఒలింపిక్స్‌లో పథకంను సాధిస్తానని అన్నారు. డ్రైవర్‌గా ఉద్యోగం చేసుకుంటూ సొంత ఖర్చులతో హేమర్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లతో పాటు పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేవారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పథకాన్ని సాధించి ఆర్‌టిసికి అంతర్జాతీయస్థాయిలో గుర్తింపుతెచ్చారు. అభినందనలు తెలిపిన వారిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కోటేశ్వరరావు, కెఎస్ బ్రహ్మానందరెడ్డి, కృష్ణమోహన్, గిడుగు వెంకటేశ్వరరావు ఉన్నారు.

అధికారం ఎవరికి ఇవ్వాలో ప్రజలే నిర్ణయిస్తారు : సజ్జల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎవరికి అధికారం ఇవ్వాలనేది ప్రజలు నిర్ణయిస్తారని, పవన్ కల్యాణ్ కాదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం సిఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ అపరిపక్వత, మూర్ఖత్వంతో మాట్లాడుతున్నారని అన్నారు. చంద్రబాబు తరుపున వకాల్తా పుచ్చుకున్నారని విమర్శించారు. ఆయన రాసిచ్చిన స్క్రిప్టు చదువుతున్నాడని, జగన్ అధికారంలోకి రాకుండా ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ఈ మూడున్నరేళ్లలో 62.5 లక్షల మంది అవ్వాతాతలు పెన్షన్ అందుకుంటున్నారని, 50 లక్షల మంది సన్నకారు రైతులకు పెట్టుబడులు రైతుభరోసా ద్వారా వస్తున్నాయని వివరించారు. కోటిమందికిపైగా డ్వాక్రా మహిళలకు నేరుగా వారి ఖాతాల్లోకి రూ.26 వేల కోట్లు వచ్చాయని తెలిపారు. 45 నుండి 60 ఏళ్ల మధ్యలో ఉన్న 40 లక్షల మంది మహిళలకు ఆర్థికంగా లబ్ధి కలిగిందని వివరించారు.

లక్షలాది మంది అమ్మఒడి అందుకున్నారని, 30 లక్షలమందికిపైగా ఇళ్లస్థలాలు తీసుకున్న మహిళలు వారి కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. బిజెపిని రోడ్‌మ్యాప్ అడిగిన అంశాన్ని మీడియా ప్రతినిధులు అడిగితే దాటవేస్తున్నారని, తెలుగుదేశం పార్టీని ఒక్క మాట కూడా అనడం లేదని తెలిపారు. 1.30 లక్షల గ్రామ సచివాలయ ఉద్యోగాలు ఇచ్చారని, ఆరోగ్యశాఖలో 40 వేలకుపైగా ఉద్యోగాలు పొందారని వివరించారు. పవన్ కల్యాణ్ సీరియస్ పొలిటీషియన్ కాదని పేర్కొన్నారు. మాచర్లలో టిడిపి కావాలనే అల్లర్లు చేస్తోందని వివరించారు. మాచర్లను చంబల్‌లోయ అని రాయడం దారుణమని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు.

మాచర్ల ఘటనపై చర్యలు

- డిజిపికి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి మూడున్నరేళ్ల పాలనలో పల్నాడు ప్రాంతంలో 16 రాజకీయ హత్యలు జరిగాయని, లా అండ్ ఆర్డర్ కాపాడటంలో పోలీసులు వైఫల్యం చెందారని టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డికి సోమవారం ఏడు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. మాచర్లలో వైసిపి అరాచక శక్తులతో కుమ్మక్కైన పోలీసు అధికారులపై లోతైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఈ లేఖలో డిమాండ్ చేశారు. మాచర్ల టిడిపి ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డికి భద్రత కల్పించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 2019 ఎన్నికల తర్వాత టిడిపి మద్దతుదారులపై జరిగిన దాడుల గురించి లేఖలో వివరించారు. 16వ తేదీన మాచర్లలో జరిగిన హింసలో నిందితులతో పాటు వారికి సహకరించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.మాచర్ల పట్టణంలో పార్టీ కార్యక్రమ నిర్వహణలో ఉన్న తమపై వైసిపి దాడి గురించి టిడిపి ఇన్‌చార్జ్ బ్రహ్మానందరెడ్డి స్థానిక డిఎస్‌పిని అప్రమత్తం చేశారని తెలిపారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ఫిర్యాదుదారునికి రక్షణ కల్పించకపోగా బలవంతంగా పట్టణం నుంచి బయటకు పంపారని పేర్కొన్నారు. లాఠీచార్జీ చేసి టిడిపి కార్యకర్తలను చెదరగొట్టారని వైసిపికి చెందిన స్థానిక ఎమ్మెల్యే సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మరో వైసిపి నేత తురకా కిశోర్ దాదాపు 300 మంది గూండాలతో వరుస దాడులకు దిగారని లేఖలో వివరించారు. అదే సమయంలో టిడిపి కార్యాలయంపై దాడి చేసి 10 వాహనాలకు నిప్పుపెట్టారని చంద్రబాబు తెలిపారు. టిడిపి నేతలు 13, 14వ వార్డుల్లో నిర్వహించే పార్టీ కార్యక్రమంపై పోలీసులకు సమాచారం లేకుండా ఉంటే ముందుగా వెళ్లి కార్డన్ సెర్చ్ ఎందుకు నిర్వహించారని తెలిపారు.

బిసి ఐక్యతను చాటుదాం : కొల్లు రవీంద్ర

జగన్ పాలనలో బిసిలంతా అన్యాయానికి గురయ్యారని, మూడున్నరేళ్లలో బిసిలను అన్ని రకాలుగా అణచివేస్తున్నారని టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర అన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో సోమవారం టిడిపి బిసి నేతల సర్వసభ్య సమావేశం జరిగింది. టిడిపితోనే బిసిల అభివృద్ధి, అభ్యున్నతి సాకారమవుతుందన్నారు.

పౌరుల హక్కులను కాలరాస్తున్నారు

- మాచర్ల ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సికి టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీసుల నిర్లక్ష్యం వల్ల శాంతిభద్రతలు కరువయ్యాయని, అధికారపార్టీతో కొంతమంది పోలీసులు కుమ్మక్కయి పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య పేర్కొన్నారు. పల్నాడు జిల్లా మాచర్లలో ఇటీవల జరిగిన ఘర్షణలపై సోమవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. మాచర్లలో అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే సోదరుడు వెంకట్రామిరెడ్డి తన ప్రైవేటు గూండాలతో దాడికి పాల్పడ్డారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వ్యక్తుల ఇళ్లను ధ్వంసం చేశారని, మహిళలను కొట్టారని, నగదు, నగలు దోచుకుపోయారని పేర్కొన్నారు. ఆరు గంటలపాటు దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారని తెలిపారు. మాచర్లలో అధికార పార్టీ నాయకుల ప్రైవేటు గూండాలు 16 మందిని హత్య చేసినా పోలీసులు హంతకులను అరెస్టు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ప్రజలు ప్రాణాల కోసం నివాసాలు వదిలి వేరే ప్రాంతాలకు వెళ్లి బతకాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఇంటలిజెన్స్ డిజి సీతారామాంజనేయులు, ఎస్‌పి రవిశంకర్‌రెడ్డి అధికార పార్టీ నేతలను సంతోషపెట్టడానికి శాంతిభద్రతలను పణంగా పెట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి దోషులకు శిక్షపడేలా చూడాలని కోరారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్‌ను కోరారు.

జీవవైవిధ్య ఒప్పందానికి ఆమోదం

మాంట్రియల్ : చారిత్రాత్మక జీవవైవిధ్య ఒప్పందానికి కెనడాలో ఐరాస జీవవైవిధ్య సదస్సులో ఆమోదం లభించింది. ప్రపంచంలో భూములు, మహా సముద్రాలను రక్షించడానికి, అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ఆర్థిక సహాయం అందించడానికి అతి ముఖ్యమైన ప్రయత్నంగా ఈ ఒప్పందాన్ని అభివర్ణిస్తున్నారు. కెనడాలోని మాంట్రియల్‌లో రెండు వారాల పాటు జరిగిన ఐరాస జీవవైవిధ్య సదస్సు లేదా కాప్ 15 శిఖరాగ్ర సదస్సులో ఈ ఒప్పందానికి ఆమోదం లభించింది. ఈ సదస్సు సోమవారం ముగిసింది. సదస్సుకు అధ్యక్షత వహించిన చైనా సోమవారం ఈ ఒప్పందాన్ని ప్రవేశపెట్టింది. 2030 నాటికి జీవవైవిధ్యానికి ముఖ్యమైన భూమి, సముద్రాల్లో 30 శాతాన్ని రక్షించాలన్నది ఈ ఒప్పందంలో ప్రధాన విషయం.

తాలిబన్ల ఆధీనంలో పాక్ పోలీస్ స్టేషన్

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని పోలీస్‌స్టేషన్‌ని తాలిబన్లు నిర్బంధించారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కౌంటర్ టెర్రరిజమ్ డిపార్ట్‌మెంట్ (సిటిడి)పై దాడి చేశారు. ఆ కేంద్రంలో ఉన్న తొమ్మిది మంది భద్రతా సిబ్బందిని నిర్బంధించారు. గతంలో అరెస్ట్ చేసిన కొందరు తాలిబన్ ఉగ్రవాదుల్లో ఒకరిని ఆదివారం సిటిడి అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆ సమయంలో ఆ ఉగ్రవాది ఒక అధికారి నుండి ఎకె-47ని లాక్కుని అధికారులపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీస్ అధికారులు మరణించారు. ఇతర ఉగ్రవాదుల్ని కూడా విడిపించి, ఆ కేంద్రాన్ని తమ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ తాలిబన్ మిలిటెంట్లు ఒక వీడియో విడుదల చేశారు. వాళ్లను విడిచిపెట్టాలంటే, తమను క్షేమంగా దేశం దాటించి, ఆఫ్ఘనిస్తాన్ చేరేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇందుకోసం ఒక హెలికాప్టర్ సిద్ధం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. పాకిస్తాన్ సైన్యం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి.. తాలిబన్ల చెర నుంచి అధికారుల్ని విడిపించేందుకు ప్రయత్నిస్తోంది. ఆదివారం నుంచి ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. ప్రావిన్స్ మాజీ ముఖ్యమంత్రి అక్రమ్ ఖాన్, ప్రావిన్స్ సిట్టింగ్ మంత్రి మాలిక్ షా మహమ్మద్ ఉగ్రవాదులతో చర్చలు జరిపేందుకు బన్నూకి చేరుకున్నారని డిపిఒ మొహమ్మద్ ఇక్బాల్ తెలిపారు.



తెలుగు సాంప్రదాయాలను కాపాడేందుకే జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు

- మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలను మంత్రి ఆర్‌కె రోజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు వారసత్వాన్ని, సంస్కృతిని పరిరక్షించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. కళలు, కళాకారులను ఈ సందర్భంగా వెలుగులోకి తెస్తామని తెలిపారు. తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నం కేంద్రంగా పాతతరం, కొత్తతరం కళాకారులతో కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో రాణించిన వారికి విజయవాడలో ఫైనల్స్‌ను నిర్వహిస్తామని అన్నారు. ఫైనల్స్‌లో గెలుపొందిన వారికి జబర్దస్త్ టీమ్ హైపర్ ఆది, అభి, చంటి, ఆటో రాంప్రసాద్, అనసూయ చేతుల మీదుగా బహుమతులను అందజేస్తామన్నారు. కూచిపూడి, ఆంధ్రనాట్యం, భరతనాట్యంతో పాటు గాత్రం, డప్పులు, గరగలు, తప్పెట్లు, చెక్కభజన వంటి జానపద పోటీలు వుంటాయని అన్నారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, కళాకారులు పెద్దఎత్తున పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాటా ప్రతినిధులు

నాటా సభలకు సిఎంకు ఆహ్వానం

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) మహాసభలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని నాటా ప్రతినిధులు ఆహ్వానించారు. సోమవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో నాటా అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎపి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ప్రతాపరెడ్డి తదితరులు సిఎంను కలిశారు. 2023 జూన్ 30 నుండి ఈ మహాసభలు జరగనున్నాయి.

తేలని స్థానికత

- వెయ్యికి పైగా ఉద్యోగుల్లో ఆందోళన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

స్థానికత కారణంగా తెలంగాణకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఉద్యోగుల విషయం ఎటూ తేలకుండా ఉంది. ఈ మేరకు 1008 మంది దరఖాస్తులను తెలంగాణ ప్రభుత్వానికి పంపించినప్పటికీ ఆ రాష్ట్రం నుంచి అనుమతి రాలేదు. దీంతో వీరిలో ఆందోళన నెలకొంది. టి. సర్కారు స్పందించకపోవడంతో వీరి విషయమై మళ్లీ అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఒక కొత్త సర్క్యులర్‌ను జారీ చేసింది. ఉద్యోగుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిలోని వాస్తవికతను అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు దీనిలో పేర్కొన్నారు. అవసరమైతే దరఖాస్తుల్లో కొన్ని మార్పులు చేసి మళ్లీ తెలంగాణ ప్రభుత్వానికి పంపాలని సాధారణ పరిపాలన శాఖ భావిస్తోంది.

నా బయోడేటా అడిగారు

- రేపు కూడా రమ్మన్నారు : ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి : బీఆర్‌ఎస్ తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని నాటకీయ పరిణామాల మధ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం ఆరుగంటల పాటు విచారించారు. మంగళవారం కూడా విచారణకు రావాలని ఆయనను ఆదేశించారు. 19న ఉదయం 10.30 గంటలకు తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ ఈనెల 16న ఈడీ అధికారులు రోహిత్‌రెడ్డికి నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయం 10 గంటల ప్రాంతంలో మణికొండలోని తన నివాసం నుంచి బయలుదేరిన రోహిత్‌రెడ్డి నేరుగా బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్తున్నట్టు అందరూ భావించారు. అయితే, మార్గ మధ్యలో తన పీఏ శ్రవణ్‌కు ఒక లేఖ అందించి ఈడీ అధికారులకు అందజేయాలని తెలిపి పంపిన రోహిత్‌రెడ్డి.. తాను మాత్రం నేరుగా ప్రగతి భవన్‌కు చేరుకున్నారు. అక్కడ సీఎం కేసీఆర్‌తో రోహిత్‌రెడ్డి సమావేశం దశలోనే ఈడీ కార్యాలయానికి చేరుకున్న శ్రవణ్.. ఎమ్మెల్యే తరపు లెటర్‌ను అందజేశారు. అనంతరం ఈడీ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని తీసుకొని శ్రవణ్ అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఈ రోజు విచారణకు రోహిత్‌రెడ్డి రాకపోవచ్చని అందరూ భావించారు. శ్రవణ్ నుంచి సమాచారం అందుకున్న రోహిత్‌రెడ్డి దాదాపు 12 గంటల ప్రాంతంలో ప్రగతి భవన్ నుంచి వెలుపలికి వచ్చి మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. విచారణకు హాజరు కావడానికి తనకు కొంత గడువు కావాలంటూ రోహిత్‌రెడ్డి పంపిన లేఖను ఈడీ అధికారులు తోసిపుచ్చి 3 గంటల సమయంలో తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్యేకు సమాచారం పంపినట్టు తెలిసింది. దీంతో మధ్యాహ్నం 3.15 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి రోహిత్‌రెడ్డి చేరుకున్నారు. అయ్యప్ప దీక్షలో ఉన్న కారణంగా ఈనెల 31 వరకు విచారణకు హాజరు కాలేనని దీక్ష ముగించుకున్న తర్వాత హాజరు కావడానికి అనుమతినివ్వాలంటూ తాను లేఖలో కోరినప్పటికీ.. ఈడీ అధికారులు అనుమతించలేదని అక్కడ ఉన్న మీడియాతో రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఏ కేసుకు సంబంధించి తనను విచారస్తున్నారో కూడా తనకు తెలియదంటూ ఆయన లోనికి వెళ్లిపోయారు. అప్పటి నుండి దాదాపు ఆరు గంటల పాటు విచారణలో పాల్గొని రాత్రి 9.15 గంటల ప్రాంతంలో రోహిత్‌రెడ్డి వెలుపలికి వచ్చి కొంత సేపు మీడియాతో మాట్లాడి వెళ్లిపోయారు. తనను ఎందుకు ఈడీ అధికారులు విచారణకు పిలిపించారో ఇప్పటికీ అర్థం కావటం లేదనీ, మంగళవారం కూడా ఉదయం 10.30 గంటల ప్రాంతంలో విచారణకు హాజరు కావాలని అధికారులు తెలిపారని ఎమ్మెల్యే అన్నారు. తనను కేవలం తన బయోడేటా గురించి అడిగారని తెలిపారు.

31మంది థాయ్ నావికుల కోసం గాలింపు చర్యలు

బ్యాంకాక్ : థాయిలాండ్ యుద్ధ నౌక హెచ్‌టిఎంఎస్ సుఖోతాయ్ ఆదివారం సముద్ర జలాల్లో మునిగిపోవడంతో గల్లంతైన 31మంది నావికుల ఆచూకీ కోసం థాయి మిలటరీ యుద్ధ నౌకలు, హెలికాప్టర్లు సోమవారం గాలింపు చర్యలు ఆరంభించాయి. థాయిలాండ్ తీరాన్ని గస్తీ కాస్తుండగా, ఆదివారం రాత్రి ఈ నౌకలోకి పెద్దఎత్తున సముద్రపు నీరు రావడంతో తీరానికి 37కిలోమీటర్ల దూరంలో మునిగిపోయింది.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం)

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితురాలి కథనం మేరకు.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయతీలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శివలక్ష్మి బదిలీపై ఆరు నెలల కిందట పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి వచ్చారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తన తల్లిని చూసేందుకు మూడు రోజుల కిందట సెలవుపై గుడివాడ వెళ్లారు. ఆ సమయంలో మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్ అందుబాటులో లేకపోవడంతో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు అనుమతితో సెలవు తీసుకున్నారు. సోమవారం తిరిగి విధుల్లో చేరగా, సెలవు పెట్టిన మూడు రోజులను కమిషనర్ గైర్హాజరుగా వేయడాన్ని గమనించారు. విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి తనకున్న సెలవులను వాడుకుంటే సెలవు ఎలా వేస్తారని ప్రశ్నించారు. కమిషనర్ తీరుపై ఆమె మనస్తాపానికి గురయ్యారు. దీంతో ఆమె బ్లేడుతో ఎడమ చేతి మణికట్టును కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఆమెను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లా సిద్దవటం పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి అన్బురాజన్ మాట్లాడుతూ..సిద్దవటం మండలం పెద్దపల్లె పంచాయతీలోని రామస్వామి గ్రామానికి కొద్ది దూరంలో ఇద్దరు స్మగ్లర్లను ఒంటిమిట్ట, సిద్దవటం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 20 ఎర్రచందనం దుంగలు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దుంగలను అక్రమ రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఎస్‌పి హెచ్చరించారు.

డాక్టర్ల చేతి రాతను సులభంగా గుర్తించొచ్చు..!

న్యూఢిల్లీ : వైద్యులు రాసే మందుల చిట్టీ అర్థం చేసుకోవడం సులభం కానుంది. అనేక మంది డాక్టర్లు రాసే గజిబిజి ప్రిస్క్రిప్షన్ డీకోడ్ చేయడానికి గూగుల్ త్వరలో ఓ యాప్‌ను తీసుకురానుంది. ఇందుకోసం వైద్యుల చేతిరాతను డిజిటలైజ్ చేయడంలో ఉపయోగపడే ఆర్టిఫిషియల్ టెక్నలాజీపై తాము పనిచేస్తున్నామని గూగుల్ రీసెర్చ్ డైరెక్టర్ మనీష్ గుప్తా వెల్లడించారు. దీంతో వైద్యులు రాసే మందుల చిటీని చదవడం, గుర్తు పెట్టుకోవడం సులభం కానుందన్నారు.

నేటి నుంచి

'మున్సిపల్ వర్కర్స్' రాష్ట్ర మహాసభ

ముస్తాబైన అనంతపురం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) 14వ రాష్ట్ర మహాసభ మంగళవారం నుంచి అనంతపురంలో జరగనున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభకు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని కృష్ణ కళామందిరం నుంచి టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన జరుగనుంది. తదనంతరం కెఎస్ఆర్ కళాశాల ఆవరణంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు తదితరులు ముఖ్య అతిథులుగా ప్రసంగించనున్నారు. రెండో రోజు నగరంలోని షిర్డీసాయి కళ్యాణమండపంలో ప్రతినిధుల సభలు ప్రారంభం కానున్నాయి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజ్ హామీ నెరవేర్చాలని, ఇంజనీరింగ్, ఇతర విభాగాల్లోని సిబ్బందికి హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని తదితర అంశాలపై ఈ మహాసభలో చర్చించనున్నారు. విశాఖలో జరిగిన 13వ మహాసభ నుంచి ఇప్పటి వరకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలను సమీక్షించుకోవడంతోపాటు, రాబోయే మూడు సంవత్సరాల కాలంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యచరణను ఇందులో రూపొందించనున్నారు. చివరి రోజు కొత్త రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక జరుగనుంది. 15 సంవత్సరాల తరువాత అనంతపురం నగరంలో రెండోసారి మహాసభ జరుగుతున్న నేపథ్యంలో మహాసభను విజయవంతం చేయడానికి జిల్లా నాయకులు పలుచోట్ల ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేసినట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగభూషణం తెలిపారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



తాడిపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం, రైతుసంఘం నాయకులు

మాండూస్ తుపానుతో నష్టపోయాం

- ఆదుకోవాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాండూస్ తుపాను, నకిలీ పత్తి విత్తనాలతో పంటలు నష్టపోయిన తమకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ అనంతపురం జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం నిరసనలు తెలిపారు. ఆయా మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ మిర్చి, వరి, మిరప, వేరుశనగ, జొన్న, పత్తి తదితర పంటలు మాండూసు తుపాను వల్ల దెబ్బతిన్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటల వివరాలను నమోదు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. వేలాది ఎకరాల్లో పంట నష్టపోతే నామమాత్రపు సర్వేలతో అధికారులు నష్టం అంచనాలను తక్కువగా వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలతో పత్తి పంటను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, నకిలీ విత్తనాలను సరఫరా చేసే కంపెనీలపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ సమస్యలపై అధికారులు స్పందించకుంటే రైతులతో కలిసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల సిపిఎం, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

ట్విట్టర్ చీఫ్‌గా ఎలన్ మస్క్ వద్దు

- పోల్‌లో టెస్లా అధినేతకు షాక్

వాషింగ్టన్ : ట్విట్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా ఉండాలా..? వద్దా..? అనే అంశంపై ఎలన్ మస్క్ నిర్వహించిన ఆ పోల్‌లో ఆ సోషల్ మీడియా వినియోగదారులు ఆయనకు ఊహించని షాక్ ఇచ్చారు. మస్క్ సిఇఒగా వద్దు అంటూ 57.5 శాతం మంది యూజర్లు ఓటు వేయగా.. 42.5 శాతం మంది అనుకూలంగా ఓటు వేశారు. ఈ పోల్‌లో 1.75 కోట్ల మంది పాల్గొన్నారు. యూజర్లు చెప్పే దానికి కట్టుబడి ఉంటానని పోల్‌కు ముందు ఎలన్ మస్క్ ఇచ్చిన వాగ్దానంపై నిలుచుంటారో లేదో వేచి చూడాలి.


ఎస్‌సి, ఎస్‌టి పథకాలను పునరుద్ధరించండి

- దళిత గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్


మాట్లాడుతున్న టి.గోపాలరావు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎస్‌సి, ఎస్‌టిలకు గతంలో అమలు చేసిన 27 రకాల పథకాలను పునరుద్ధరించాలని విశ్రాంత ఐఎఎస్ అధికారి, దళిత-గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ టి.గోపాలరావు డిమాండ్ చేశారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో సామాజిక న్యాయం అమలు తీరుపై సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో గోపాలరావు మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం దళిత, గిరిజన, బలహీన వర్గాల వారికి అత్యున్నత పదవులిచ్చినా వాటికి నిధులు, అధికారాలు ఇవ్వలేదని విమర్శించారు. 56 బిసి కార్పొరేషన్లు, మూడు ఎస్‌సి కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. 2017-2022 మధ్య ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.1,27,800 కోట్లు సబ్ ప్లాన్‌లో కేటాయించినా ఖర్చు చేయలేదని, ఎస్‌సి, ఎస్‌టి పేదలకు గత 40 నెలలుగా ఒక్క ఎకరా వ్యవసాయ భూమి కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. స్వయం ఉపాధి రుణాలు, నైపుణ్యాల పెంపుదల, హాస్టల్స్ మెరుగుదల లాంటి చర్యలు చేపట్టడం లేదని, అవస్థాపన సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తయితే గ్రామీణ పేదలకు ఉపాధి లభిస్తుందని, అయితే వాటికి నిధులు సరిగా కేటాయించడం లేదని చెప్పారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్, ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం ప్రసంగించారు.


దీక్షలను ప్రారంభిస్తున్న గిరిజన సంఘం నేత లక్కు

గిరిజన విద్యార్థుల మృతిపై

విచారణ చేపట్టాలని రిలే దీక్షలు

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి జిల్లాలోని గిరిజన పాఠశాలల్లో అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థుల వరుస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పాడేరు ఐటిడిఎ ఎదుట సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు తలపెట్టారు. తొలి రోజు దీక్షలను ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాలికి లక్కు ప్రారంభించారు. అనంతరం దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడ రాధాకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కిల్లో ప్రభుదాస్ మాట్లాడుతూ.. నెల రోజుల్లో నలుగురు విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. విద్యార్థుల వరుస మరణాలకు పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ బాధ్యత వహించాలన్నారు. పిఒ వేధింపులతోనే పెదబయలు తహశీల్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్న పిఒపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. దీక్షల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.జీవన్ కృష్ణ, సహాయ కార్యదర్శి చిన్నా, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మువ్వల లక్ష్మణరావు పాల్గొన్నారు.

జతపత్రం IV
(చూడండి నిబంధన 8(1)
స్వాధీన నోటీసు
(స్థిరాస్తి కోసం)

పేర్కొనడంఏమనగా,

దిగువ సంతకం చేసిన వారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఇన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 కింద **ఇండియాబుల్స్ కమర్షియల్ క్రెడిట్ లిమిటెడ్ (CIN:U65923DL2006PLC150632)** యొక్క అధికృత అధికారి మరియు సెక్యూరిటీస్ ఇంట్రెస్ట్ (ఇన్ఫోర్స్‌మెంట్) నిబంధన, 2002 యొక్క నిబంధన 3 లోని సెక్షన్ 13 (12) కింద హక్కులను వినియోగించుకుంటూ, లోన్ అకౌంట్ నం **HLLAVJW00395259** లో తేదీ **10.06.2021** నాటికి నోటీసులో పేర్కొన్న **రూ. 1,82,85,667.24/- (ఒక కోటి ఎనభై రెండు లక్షల ఎనభై ఐదు వేల ఆరు వందల అరవై ఏడు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే)** అసలు మొత్తాన్ని దానిపై అయ్యే వడ్డీతో సహా, ఈ నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోపు తిరిగి చెల్లించవలసిందిగా ఋణం తీసుకున్న వారైన **కొల్లా వెంకట సత్యనారాయణ అలియాస్ వెంకట సత్యనారాయణ కొల్లా, కొల్లా అలివేలు మంగమ్మ మరియు కొల్లా శివ కుమార్** లను కోరుతూ తేదీ **16.06.2021** నాడు డిమాండ్ నోటీసు జారీ చేయడం జరిగింది.

ఋణం తీసుకున్న వారు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, పేర్కొన్న చట్టం సెక్షన్ 13(4) లోని పేర్కొన్న నిబంధన 8 ప్రకారం తేదీ **14.12.2022** నాడు అతనికి గల హక్కును వినియోగించుకుంటూ దిగువ సంతకం చేసిన వారు దిగువ **ఆస్తిని స్వాధీనం** చేసుకున్నారని ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానికానికి నోటీసు జారీ చేస్తున్నారు.

ప్రత్యేకించి ఋణం తీసుకున్న వారికి మరియు సాధారణ ప్రజానీకానికి ఈ ఆస్తి విషయంలో వ్యవహారాలు కొనసాగించవద్దని హెచ్చరించడమైనది మరియు దీని విషయంలో ఏవైనా లావాదేవీలు జరిపితే తేదీ **10.06.2021** నాటికి ఇండియాబుల్స్ కమర్షియల్ క్రెడిట్ లిమిటెడ్‌కి **రూ. 1,82,85,667.24/- (ఒక కోటి ఎనభై రెండు లక్షల ఎనభై ఐదు వేల ఆరు వందల అరవై ఏడు రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే)** మొత్తాన్ని మరియు దీనిపై అయ్యే వడ్డీతో సహా చెల్లించవలసి ఉంటుంది.

సెక్యూర్డ్ ఆస్తులని రిడీమ్ చేసుకునేందుకు లభించే సమయానికి చట్టంలోని సెక్షన్ 13 కోని ఉప-సెక్షన్ (8) నిబంధనలపై దృష్టి పెట్టవలసిందిగా రుణ గ్రహీతను ఆహ్వానించడం జరుగుతోంది.

స్థిరాస్తి వివరాలు

200 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించబడిన ఒక ఆర్‌సిసి రూఫ్డ్ బిల్డింగ్ . ఆర్.ఎస్.నం.172/2బి, అసెస్మెంట్. నం. 36050/1, కొత్త అసెస్మెంట్. నెం. 275439, పి మరియు టి కాలనీ, రోడ్ నెం. 3, శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమం రోడ్ పడమట, విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, విజయవాడ కార్పొరేషన్ ఏరియా పరిధిలోని కృష్ణా జిల్లా, విజయవాడ – 520009, ఆంధ్రప్రదేశ్, దీని సరిహద్దులు ఇలా ఉంటాయి:

తూర్పు : రోడ్డు | పశ్చిమం : కె. కనకరావు యొక్క ఆస్తి
ఉత్తరం : డోర్ నం. 56-10-32 బి.రామకృష్ణ | దక్షిణం : డోర్ నం. 56-10-31 జి.డి.లక్ష్మి

తేదీ : 14.12.2022
స్థలం : విజయవాడ

అధికృత అధికారి
ఇండియాబుల్స్ కమర్షియల్ క్రెడిట్ లిమిటెడ్

సమస్యలు పరిష్కరించాలని 108 ఉద్యోగుల సమ్మె నోటీసు

- సంక్రాంతి తర్వాత దశలవారీ ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 108 అంబులెన్స్ సర్వీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో జనవరి 15 తర్వాత ఏ రోజైనా సమ్మె నిర్వహించడంతోపాటు, దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ పేర్కొంది. ఈ మేరకు సోమవారం అధికారులతోపాటు యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసింది. అక్టోబరు, నవంబరు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా తొలగించిన ఉద్యోగులందరినీ విధుల్లోకి తీసుకోవాలని సోమవారం నల్ల రిబ్బన్లు ధరించి ఉద్యోగులు విధులకు హాజరయ్యారు. సమ్మె నోటీసులో పేర్కొన్న అంశాలను యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మీడియాకు తెలిపారు. అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, అరబిందో సంస్థలో వాహన ప్రమాదం జరిగిన వెంటనే విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులను విధుల్లో నుంచి తొలగించి, ఎఫ్ఐఆర్ పేరుతో నిలుపుదల చేస్తామనే నిబంధనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 108 సర్వీసుల్లో పనిచేస్తున్న ప్రతి ఇఎంటిలకు ప్రతి నెల రూ.30 వేలు, పైలెట్లకు రూ.28 వేలు వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. అందరికీ సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి సంవత్సరం వేతనంపై 20 శాతం వేతన పెంపును అమలు చేయాలని, మూడు నెలల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. 108 సర్వీసులో ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు అమలు చేసి ఉద్యోగులపై ఒత్తిడిని తగ్గించాలని, పిఎఫ్, ఇఎస్ఐ కోసం సంస్థ ఉద్యోగి , యాజమాన్య వాటాలు రెండూ ఉద్యోగి జీతం నుంచే మినహాయిస్తున్నారని ఇది చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. అరబిందో ఎమర్జన్సీ మెడికల్ సర్వీసెస్ నిర్వహణా బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన ఉద్యోగు ల కుటుంబాలకు సంస్థ పరంగా రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని, ప్రభుత్వ చెల్లింపులతో నిమిత్తం లేకుండా ప్రతి నెలా ఒకటోతేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

క్యాసినోపై ఐటికి అన్ని ఆధారాలూ ఇచ్చాం

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య
- రూ.500 కోట్లు చేతులు మారాయి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుడివాడలో క్యాసినోకు సంబంధించి తాము చేసిన ఫిర్యాదులపై ఐటి అధికారులు వివరాలు తెలపాలని నోటీసులు ఇచ్చారని, తమవద్ద ఉన్న సమాచారాన్ని ఇచ్చామని పేర్కొన్నారు. సోమవారం టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, గుడివాడ టిడిపి ఇన్‌ఛార్జి రావి వెంకటేశ్వరరావు విజయవాడ బందరు రోడ్డులో ఐటి శాఖ అధికారులను కలిసి టిడిపి నిజనిర్ధారణ కమిటీ (ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) సేకరించిన వివరాలను ఐటి అధికారులకు అందజేసింది. గుడివాడ క్యాసినో వెనుక మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఉన్నారని టిడిపి ఆరోపించిన సంగతి పాఠకులకు విదితమే. ఐటి అధికారులను కలిసిన అనంతరం వర్ల రామయ్య మీడియాతో మాట్లాడారు. గుడివాడలో క్యాసినో నిర్వహిస్తున్నట్లు చికోటి ప్రవీణ్ ప్రచారం చేసిన ఆధారాలనూ ఐటి అధికారులకు ఇచ్చామ న్నారు. రాష్ట్రస్థాయిలో అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడంతో కేంద్ర దర్యాప్తు సంస్థలకు టిడిపి ఎంపిలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఐటి శాఖ స్పందించి వివరాలు కావాలని కోరారన్నారు. చికోటి ప్రవీణ్ తన స్నేహితుడేనని గన్నవరం ఎమ్మెల్యే వంశీ స్వయంగా చెప్పారని, గుడివాడ క్యాసినోలో జై నాని అంటూ నినాదాలు కూడా చేశారని వర్ల రామయ్య తెలిపారు. గుడివాడ క్యాసినోలో రూ.500 కోట్లమేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని, చికోటి ప్రవీణ్ జరిపిన నేపాల్ లావాదేవీల మీద కూడా విచారణ జరగబోతు న్నట్లు తెలిపారు. గోవా నుంచి మహిళలు గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చిన విమానటిక్కెట్లను కూడా ఐటి అధికారులకు ఇచ్చామని, క్యాసినో జరిగే ప్రాంతంలో వడ్డీ వ్యాపారులు న్నారని, స్టాంప్ పేపర్ల మీద సంతకాలు కూడా చేయించుకున్న విషయాన్ని ఐటి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



పోర్టు గేటు వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

పోర్టుల ప్రైవేటీకరణ వద్దంటూ ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

మేజర్ పోర్టుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖపట్నం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పోర్టు గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మేజర్ పోర్టుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు డిమాండ్ చేశారు. షరతులులేని వేతన ఒప్పందం చేయాలన్నారు. బోనస్ బ్యాలెన్స్ చెల్లిస్తూ కొత్త ఫార్ములా రూపొందించాలని, నేషనల్ ఎసెట్స్ మోనిటైజేషన్ పైపులైన్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. పోర్టు హాస్పిటల్, భూములు, భవనాలు, కల్యాణ మండపాలను ప్రైవేటీకరణ చేయొద్దని అన్నారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు జెవి.సత్యనారాయణమూర్తి బిసిహెచ్.మసేన్, హెచ్ఎంఎస్ పోర్టు జనరల్ సెక్రటరీ డికె.శర్మ, నాయకులు మంగయ్య నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో పిపిపిని ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే గంగవరం పోర్టును అదానీకి అప్పగించారని, విశాఖ పోర్టులో బెర్తులను ప్రయివేటుకు అప్పగించేందుకు చూస్తున్నారని, ఇలాంటి దారుణ చర్యలను మానుకోవాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ జరిగితే ఉద్యోగులు ఉపాధి కోల్పోయే అవకాశముందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.జగన్, సిహెచ్.త్రినాధరావు, బి.లక్ష్మణరావు, చందు పాల్గొన్నారు.

Chola Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పోరేట్ ఆఫీసు: 1వ అంతస్తు, 'డేర్ హౌజ్', నెం.2, ఎన్.ఎస్.సి బోస్ రోడ్, చెన్నై -600 001

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ మరియు రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 ("చట్టం") మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూల్స్) యొక్క నిబంధనల ప్రకారం

కింద సంతకం చేసిన చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి (సెక్యూర్డ్ క్రెడిటార్) చట్టంలోని సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాలను అమలు చేసూ, నిబంధన 3తో చదివిన సెక్షన్ కింద డిమాండ్ నోటీసు(లు) జారీ చేయబడింది. చట్టంలోని 13 (2) పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు సంబంధిత నోటీసు (ల)లో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు)ని పిలవడం జరిగింది. రుణగ్రహీత (లు) డిమాండ్ నోటీసు (ల) సేవలను తప్పించుకుంటున్నారని/ నివారిస్తున్నారని దిగువ సంతకం చేసిన వారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు. కాబట్టి నిబంధనల ప్రకారం అనుబంధం చేయడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ ప్రభావితమవుతుంది. డిమాండ్ నోటీసు(ల)లోని విషయాలు ఇక్కడ దిగువన సంగ్రహించబడ్డాయి.

క్ర. సం.	రుణ ఖాతా నెం. & రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామా	రుణం మొత్తం	డిమాండ్ నోటీసు తేది & బాకీపడిన మొత్తం	స్థిరాస్తి / ఆస్తి యొక్క వివరాలు
1	రుణ ఖాతా నెం. HL05GUT000010605 బషీద షేక్ 2. షేక్ మహబూబ్‌బీ ఇరువురి నివాసం: డో.నం.5-4 భవానీపురం, హీరో షోరూం వద్ద, చిరుకుపల్లి, ఆంధ్రప్రదేశ్-522 309, ఇక్కడ కూడా: డో.నం.399-3, 399-5, వార్డు నం.4, డో.నం.174 వద్ద, ప్లాట్ నం.5 యొక్క తూర్పు భాగం, టు లిటిల్ హార్ట్స్ ఇ.మీ. స్కూల్ మరియు హోసన్న మందిర్ వద్ద, అరుంబాక చెరుకుపల్లి, గుంటూరు, స్కూల్ వద్ద, చెరుకుపల్లి-522 309, ఆంధ్రప్రదేశ్.	₹ 27,25,642/-	16.12.2022 రూ. 28,08,592/- (ఇరవై ఎనిమిది లక్షల ఎనిమిది వేల ఐదు వందల తొంభై రెండు రూపాయలు మాత్రమే) 15.12.2022 నాటికి.	గుంటూరు జిల్లా, చెరుకుపల్లి ఉపజిల్లా, అరుంబాక గ్రామ పంచాయతీ ఏరియా, అరుంబుక గ్రామం వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్శిల్ డో.నం.399-3 మరియు డో.నం.399-5, అరుంబాక పంచాయతీ, వార్డు నం.4, డో.నం.174 వద్ద, విస్తీర్ణం 115-2 చ.గజాలు. సైట్ ప్రస్తుతం ఆర్‌సిసి భవనంతో ప్లింత్ ఏరియా 1036.8 చ.అడుగులు. దాని అన్నీ ఫిక్చర్లు మరియు ఫిట్టింగులు. దీని హద్దులు: తూర్పు: ప్లాట్ నం.1 యొక్క సైట్-40'.06"; దక్షిణం: విక్రేత/గుడిగంటల ప్రకాశరావు యొక్క ప్లాట్ నం.6 యొక్క సైట్-25'.06"; పడమర: విక్రేత/ గుడిగంటల ప్రకాశ రావు యొక్క ప్లాట్ నం.5కి చెందిన పడమర వైపు మిగిలిన స్థలం-40'.06"; ఉత్తరం: 18 అడుగుల వెడల్పు బజార్-25'.08".
2	రుణ ఖాతా నెం. HL01GUT000026905 ఎడ్లపల్లి రజని, 2. అచ్చుత ఎడ్లపల్లి : ఇరువురి నివాసం: ఫ్లాట్ నం.403, కె. లింగారెడ్డి టవర్స్, గుడి ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 034; ఇక్కడ కూడా: 10వ లేన్, అమరావతి రోడ్డు, కె. లింగారెడ్డి టవర్స్, వంశీకృష్ణరైస్ మిల్ వెనక వైపు, గుంటూరు-522 007, ఆంధ్రప్రదేశ్.	₹ 19,50,000/-	16.12.2022 రూ. 20,12,623/- (ఇరవై లక్షల పన్నెండు వేల ఆరు వందల ఇరవై మూడు రూపాయల నలభై ఐదు పైసలు మాత్రమే) 15.12.2022 నాటికి.	గుంటూరు జిల్లా, కొరిటిపాడు ఉపజిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ బేరింగ్ డో.నం.134, ఎసి. 3.35 సెంట్లు. కొరిటేపాడు గ్రామం, "కె. లింగారెడ్డి టవర్స్" ప్లాట్ నంబర్లు. 1,2,3 మరియు విస్తీర్ణం 836.1/4 చ.గజాలు. బయటకు 863.97 చ.గజాలు. ఉన్న దీని హద్దులు: తూర్పు: 30 అడుగుల వెడల్పు రోడ్డు 103'-6" చ.అడుగులు., దక్షిణం: ప్లాట్ నం.4- 73'-3"చ.అడుగులు., పడమర: ప్లాట్ల యొక్క ఆస్తి 102'-0" చ.అడుగులు., ఉత్తరం: కె. చిరంజీవిరెడ్డి కి చెందిన ఆస్తి 73'-3" చ.అడుగులు. ఈ సరిహద్దుల పరిధిలో 836.1/4 చ.గజాలు. లేదా 699.2137 చ.మీటర్లు. సైట్ మరియు అన్నీ సౌలభ్య హక్కులతో, దానిపై ఉపకరణములు., అవిభక్త మరియు పేర్కొనబడని వాటా యొక్క కొలతలు 41.8125 చ.గజాలు. లేదా 34.9606 చ.మీటర్లు. సైట్ మొత్తం నుండి విస్తీర్ణం యొక్క సైట్ మరియు "కె. లింగారెడ్డి టవర్స్" లోని 4వ అంతస్తులో ఉన్న ఒక ఫ్లాట్ బేరింగ్ నం.502తో పాటు ప్లింత్ ఏరియా యొక్క 1060 చ.అడుగులు. ఆర్‌సిసి (కామన్ ఏరియాలు మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా) పైన వాటా కోసం ఉన్న సైట్ నిర్మాణం దీని హద్దులు: తూర్పు: 30 అడుగుల వెడల్పు రోడ్డుకు ఆనుకొని ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: కామన్ మెట్లకేస్ మరియు కామన్ కారిడార్, ఉత్తరం: ఓపెన్ టు స్కై. 4వ అంతస్తులో ఉన్న ఈ సరిహద్దులు ఫ్లాట్ బేరింగ్ నం.502 అనగా పైన పేర్కొన్న "కె.లింగారెడ్డి టవర్స్" లో స్టిల్ట్, గ్రౌండ్, 1వ,2వ మరియు 3వ అంతస్తులు మరియు అన్నీ సౌలభాలతో పాటు మరియు కామన్ మరియు ఉమ్మడి హక్కులతో పాటు అన్నీ సాధారణ హక్కులు మరియు ఉపకరణములు మొదలనవి, స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కార్ పార్కింగ్ ఏరియా కేటాయింపుతో సహా.

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు (లు)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చులు మరియు ఖర్చులతోపాటు అందులో పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లింపు యొక్క సాక్షాత్కార తేదీ వరకు చెల్లించాలని దీని ద్వారా సూచించారు. చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సురక్షిత రుణదా అని మరియు రుణగ్రహీత (లు) పొందే రుణ సదుపాయం స్థిరాస్తి/ ఆస్తులు తనఖగా ఉంచిన సురక్షి ఆస్తి (లు)కి వ్యతిరేకంగా సురక్షి రుణం అని రుణగ్రహీత (లు) గమనించవచ్చు. రుణగ్రహీతలు నిర్ణీ గడువులోగా తమ బాధ్యతలను పూర్తి చేయడంలో విఫలమైతే, సురక్షితమైన ఆస్తులు (లు) స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం అన్ని హక్కులను వినియోగించుకోడానికి సురక్షి రుణదాకు అర్హత ఉంటుంది. విక్రయం ద్వారా చట్టం మరియు దాని క్రింద ఉన్న నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా మరియు ద్వారా వాటిని బదిలీ చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా. సురక్షిత రుణదాతకు అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షి ఆస్తులు(లు) అటాచ్ చేయడానికి మరియు/లేదా సీల్ చేయడానికి కూడా అధికారం ఉంది. సురక్షిత ఆస్తుల (ల) విక్రయం ర్వా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, బ్యాలెన్స్ బకాయిలను తిరిగి పొందటానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్‌కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు స్వతంత్రంగా ఉంటుంది.

అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) కి, సురక్షిత ఆస్తులను మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి రుణగ్రహీతల దృష్టిని ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా రుణగ్రహీత (లు) సురక్షిత ఆస్తి (ల)ను పాడు చేయడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సురక్షి ఆస్తి(ల) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా బదిలీ చేయడం నుండి నిరోధించబడింది/ నిషేధించబడింది సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ కింద సంతకం చేసిన వారి వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత (లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ వేళల్లో ఏదైనా పని దినాన దిగువ సంతకం చేసిన వారి నుండి సేకరించుకోవచ్చును.

తేది: 20.12.2022
ప్రదేశం: గుంటూరు, ఆంధ్రప్రదేశ్.

సం/- ఆధీకృత అధికారి,
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్. తరపున



ప్రధానితో గూగుల్ చీఫ్ సుందర్ భేటీ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడితో దిగ్గజ టెక్ కంపెనీ గూగుల్, అల్ఫాబెట్ సిఇఒ సుందర్ పిచాయ్ సమావేశం అయ్యారు. 'గూగుల్ ఫర్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా భారత్ వచ్చిన పిచాయ్ సోమవారం న్యూఢిల్లీలో ప్రధానితో సమావేశ మయ్యారు. అన్ని వర్గాల వారికి ఇంటర్నెట్ అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాలకు పూర్తి మద్దతు ఇస్తామని పిచాయ్ పేర్కొన్నారు. "ప్రధానితో జరిగిన ఈ గొప్ప సమావేశానికి ధన్యవాదాలు. మోడీ నాయకత్వంలో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు రావడం ఎంతో స్ఫూర్తిదాయకం. మా దఢమైన భాగస్వామ్యాన్ని కొనసాగించడానికి భారత్ అధ్యక్షత వహిస్తోన్న జి-20 సదస్సు నిర్వహణకు పూర్తి మద్దతు కోసం ఎదురుచూస్తున్నాం' అని ప్రధానితో భేటీ అనంతరం పిచాయ్ ట్వీట్ చేశారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రులు

- ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు తెలిపారు. విశాఖపట్నం ఆరిలోవలోని విమ్స్‌లో రూ.1.5 కోట్లతో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకును సోమవారం జిల్లా కలెక్టర్ మల్లికార్జున్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధికి మెడికల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను సమకూర్చనున్నామని తెలిపారు. నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని ఆస్పత్రులకు రూ. వందల కోట్లు కేటాయించామన్నారు. కెజిహెచ్ అభివృద్ధికి సుమారు రూ. 600 కోట్లతో నాడు - నేడు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. తిరుపతి సిమ్స్, నిజామాబాద్ నిమ్స్ తరహాలో విమ్స్ ఆసుపత్రిని అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. రెండు, మూడు నెలల్లో రూ.250 కోట్లతో విమ్స్‌లో నూతన భవనాలు నిర్మిస్తామన్నారు. న్యూరో సర్జరీ, కార్డియాలజీ విభాగాలను సూపర్ స్పెషాలిటీ విభాగాలుగా అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. జాతీయ రహదారికి దగ్గరలో విమ్స్ ఉన్నందున ట్రోమా కేర్ సెంటర్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. సిమ్స్ వైద్యులకు చెల్లిస్తున్న జీతాలు మాదిరిగానే విమ్స్‌లోనూ చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె రాంబాబు, ఆర్ఎంఒ డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.


విమ్స్‌లో బ్లడ్ బ్యాంకును ప్రారంభిస్తున్న కృష్ణబాబు

సంపాదకీయం

అభద్రతలో ఉద్యోగులు

ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి సచివాలయ సందర్శన సందర్భాన తమది 'ఎంప్లాయి ఫ్రెండ్లీ' ప్రభుత్వమని ప్రకటించారు. పోను పోను ఉద్యోగుల ఎడల సర్కారు ధోరణి 'స్నేహ పూర్వకం' నుంచి దూరం జరిగిందనడానికి మూడున్నరేళ్లలో ఎన్నో ఉదంతాలు కనిపిస్తాయి. ఒకటవ తారీఖున జీతం పొందడాన్ని కొన్ని నెలలుగా రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు మర్చిపోయారు. ఐదవ తేదీ లోపు జీతాలు పడితే చాలనుకుంటున్నారు. నెలలో మూడవ వారానికి కూడా అందరికీ జీతాలు, పింఛన్లు పడే పరిస్థితి లేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ సిబ్బందికి చాలా విభాగాల్లో నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉంటున్నాయి. స్థానిక సంస్థలైన పంచాయితీలు, పట్టణాలు, కార్పొరేషన్లలో పారిశుధ్య కార్మికులకు సైతం అంతే. పలు స్కీం వర్కర్లదీ అదే తీరు. కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ సిబ్బందికి క్రమబద్ధంగా జీతాలిచ్చేందుకు 'ఆప్కాస్'ను నెలకొల్పినా పరిస్థితిలో పెద్దగా తేడా ఏమీ లేదు. ఉద్యోగ అభద్రత రాజ్యమేలుతోంది. ఉద్యోగులు దాచుకున్న డబ్బు, ఇతర బకాయిలు చెల్లింపులూ పెండింగే. డిఎలు, ఇతర భత్యాల గురించి చెప్పనలవి కాదు. తమ సమస్యలపై గొంతెత్తే వారిపై ఎసిబి, విజిలెన్స్ కేసులతో ప్రభుత్వం భయపెడుతోంది. మాకు మేనిఫెస్టో అనేది భగవద్గీత, ఖురాన్, బైబిల్, మాట తప్పం మడమ తిప్పం అని చెప్పగా, ఉద్యోగుల కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) రద్దు హామీ విషయంలో మాట తప్పింది వైసిపి ప్రభుత్వం. అధికారంలోకి వచ్చిన వారంలో సిపిఎస్ రద్దు చేస్తామనగా, అవగాహన లేక వాగ్దానం చేశామని నాలుక మడతపెట్టడం ఘోరం. రాజస్థాన్, ఛతీస్‌గఢ్, పంజాబ్, తాజాగా హిమాచల్‌ప్రదేశ్ సిపిఎస్‌ను రద్దు చేయగా ఇక్కడ మాత్రం ససేమిరా కుదరదంటోంది. జిపిఎస్ అని విన్యాసాలు లంకించుకుంది. ఉద్యోగులతో చర్చలకూ సిద్ధపడట్లేదు.

ఎంతకూ వేతన సవరణపై ప్రభుత్వం తేల్చకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు 'చలో అమరావతి' పిలుపునివ్వగా ఆ రోజు ప్రభుత్వం ప్రయోగించిన పోలీస్ నిర్బంధం అంతా ఇంతా కాదు. కేసులు, అరెస్టులు, హౌస్ అరెస్టులు, బారికేడ్లు, ముళ్లకంచెలతో తన ఉద్యోగులపై తానే యుద్ధం ప్రకటించింది. చివరికి అసంబద్ధ, రివర్స్ పిఆర్‌సి ఇచ్చింది. నాడు పిఆర్‌సి ఉద్యమంపై ప్రయోగించిన కర్కశం అనంతరం సిపిఎస్ రద్దు ఉద్యమకారులపైనా, తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు నిర్వహించే ఆందోళనలపైనా నిత్యకృత్యమైపోయింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించేది లేదని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నుంచి ప్రభుత్వం వైదొలిగింది. పదేళ్ల లోపు సర్వీసు కలిగిన ఔట్‌సోర్స్ సిబ్బంది లెక్కలు తీయాలని ఆదేశాలిచ్చింది డైరెక్టరేట్ ఆఫ్ అకౌంట్స్ విభాగం. సిబ్బందిలో కలకలం లేవగా 'కర్ర విరగకూడదు పాము చావకూడదు' అన్న చందాన ఆ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలుపుదల చేసింది. తొలగింపు కత్తి ఔట్‌సోర్స్ ఉద్యోగుల మెడపై వేలాడదీసే ఉంచింది. విఆర్‌ఒలు, విలేజి సర్వేయర్ల హాజరుపై చర్యలు చేపట్టాలని స్వయంగా సిఎం కార్యాలయం ఆదేశాలిచ్చింది. ఉపాధ్యాయుల ఫేషియల్ అటెండెన్స్ నిబంధన ఉండనే ఉంది. ఇటువంటి ఆంక్షలు ఉద్యోగులపై మానసికంగా ఒత్తిడి పెంచుతాయి. ఇప్పటికే శాశ్వత నియామకాల్లేక అదనపు పని భారం మోస్తున్న సిబ్బందికి అదనపు డ్యూటీలు, ఫేషియల్ హాజరీల వంటివి పాలనకు కంటకంగా తయారవుతాయి.


కేవలం ఆర్థిక ఇబ్బందుల కారణంతోనే ఉద్యోగుల పట్ల ప్రభుత్వ ప్రవర్తన ఈ విధంగా ఉందనుకోలేం. నయా-ఉదార విధానాలు, కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లు రాష్ట్ర ప్రభుత్వంపై పని చేస్తున్నాయి. వాటి నుంచి ప్రభుత్వం విడగొట్టుకోవాలి. పథకాలను, పాలనను ప్రజల చెంతకు చేర్చేందుకు వారధిలా పని చేసే ఉద్యోగుల పట్ల ప్రభుత్వం బాధ్యతాయుత, జవాబుదారీ, పారదర్శక, స్నేహపూర్వకంగా వ్యవహరించాలి. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే మార్గం.

మహనీయుల మాట



రాజకీయపరమైన స్వాతంత్ర్యం ఎంత వున్నా అది ఆకలితో అలమటించేవారిని సంతోషపెట్టలేదు.

-వి ఐ లెనిన్



ఆదాయాల్లో, సంపదలో అసమానతల పెరుగుదల

విశ్లేషణ

> ఆదాయాల్లో పెరుగుతున్న అసమానతలను వివరించడానికి పెద్దగా లోతైన సిద్ధాంతం ఏమీ అవసరం లేదు. సాంకేతికపరంగానూ, వ్యవస్థీకృతంగానూ ఉన్న అన్ని అవరోధాలనూ తొలగించిన తర్వాత నయా ఉదారవాద వ్యవస్థలో శ్రామిక ఉత్పాదకత పెరిగే రేటు ఏ స్థాయిలో ఉంటుందంటే దాని ఫలితంగా ఉపాధి కల్పన పెరిగే రేటు అంతకు మునుపటి కన్నా బాగా దిగువకు పడిపోతుంది. శ్రామికవర్గ జనాభా పెరిగే రేటు కన్నా కూడా దిగువకు పడిపోతుంది. జిడిపిలో వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ ఇది జరుగుతుంది. నిరుద్యోగుల నిష్పత్తి ఉద్యోగుల నిష్పత్తి తో పోల్చినప్పుడు పెరుగుతుంది. అందువల్ల నిజవేతనాలు కనీసస్థాయిలోనే ఉండిపోతాయి.

నయా ఉదారవాద వ్యవస్థలో అసమానతలు ..ఆదాయాల్లో గాని, సంపదలో గాని చాలా నాటకీయంగా పెరిగిపోయాయనడంలో ఎటువంటి వివాదమూ లేదు. పికెటీ బృందం వాస్తవానుభవాల ఆధారంగా చేసిన అధ్యయనం ఆదాయాల్లో అసమానతలు పెరిగిపోయినట్టు చూపిస్తున్నది. . ఒక దేశపు జాతీయ ఆదాయంలో ఆ దేశంలోని అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనాభా ఎంత వాటా కలిగివున్నదీ నిర్ధారించడానికి ఆ దేశపు ఆదాయపన్ను లెక్కలను ప్రాతిపదికగా వాళ్లు తీసుకుని లెక్కించారు. ఈ పద్ధతి సరైనదా కాదా అని కొందరు అభ్యంతరాలు పెట్టవచ్చు కాని, ఆ బృందం వచ్చిన నిర్ధారణలు ఎంత కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయంటే వాటిని ఎవ్వరూ ప్రశ్నించలేరు.

భారతదేశపు ఉదాహరణనే తీసుకుందాం. 1982లో మన దేశంలోని అత్యంత సంపన్నులైన ఒక శాతం జనాభా ఆనాటి జాతీయ సంపదలో 6 శాతం వాటా కలిగివున్నారని పికెటీ, ఛాన్సెల్ బృందం గమనించారు. అది కాస్తా 2013 నాటికి ఏకంగా 22 శాతానికి పెరిగిపోయినట్టు, 2014 లోనూ అంతే మోతాదులో ఉన్నట్టు వాళ్లు గమనించారు. 1922 లో మన దేశంలో ఆదాయపన్నును మొదటిసారిగా ప్రవేశ పెట్టారు. అప్పటినుంచీ చూసుకుంటే 2013నాటికి పెరిగినంత ఎక్కువగా అత్యంత సంపన్నులైన ఒక శాతం జనాభా సంపద అంతకు ముందెన్నడూ పెరిగి వుండలేదు.



ప్రభాత్ పట్నాయక్

ఐతే, ఆవిధంగా ఎందుకు పెరిగిపోయిందన్న దానికి పికెటీ ఇచ్చిన సైద్ధాంతిక వివరణ మాత్రం ఆమోదయోగ్యం కాదు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఎప్పుడూ పూర్తిస్థాయిలో ఉపాధి కల్పిస్తుందన్న ప్రాతిపదికపై పికెటీ వివరణ ఆధారపడివుంది. నిజానికి ఆ విధంగా పూర్తిస్థాయిలో ఉపాధి కల్పన అనేది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండడం వాస్తవానుభవానికి గాని, తర్కానికి కాని విరుద్ధంగా ఉంది. పూర్తిస్థాయిలో ఉపాధి గనుక ఉంటే పెట్టుబడిదారీ వ్యవస్థ అందులో ఉత్పత్తిని తాను కోరుకున్న విధంగా అదుపులో ఉంచజాలదు.

ఆదాయాల్లో పెరుగుతున్న అసమానతలను వివరించడానికి పెద్దగా లోతైన సిద్ధాంతం ఏమీ అవసరం లేదు. సాంకేతికపరంగానూ, వ్యవస్థీకృతంగానూ ఉన్న అన్ని అవరోధాలనూ తొలగించిన తర్వాత నయా ఉదారవాద వ్యవస్థలో శ్రామిక ఉత్పాదకత పెరిగే రేటు ఏ స్థాయిలో ఉంటుందంటే దాని ఫలితంగా ఉపాధి కల్పన పెరిగే రేటు అంతకు మునుపటి కన్నా బాగా దిగువకు పడిపోతుంది. శ్రామికవర్గ జనాభా పెరిగే రేటు కన్నా కూడా దిగువకు పడిపోతుంది. జిడిపిలో వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ ఇది జరుగుతుంది. నిరుద్యోగుల నిష్పత్తి ఉద్యోగుల నిష్పత్తి తో పోల్చినప్పుడు పెరుగుతుంది. అందువల్ల నిజవేతనాలు కనీసస్థాయిలోనే ఉండిపోతాయి. ఒకవైపు శ్రామిక ఉత్పాదకత పెరుగుతూవున్నా వేతనాల స్థాయి మాత్రం కనీసంగానే ఉంటుంది. దాని ఫలితంగా ఆదాయాల అసమానతలు పెరిగిపోతాయి. నయా ఉదారవాద విధానాల ఫలితంగా ఒక వర్గానికి ఆదాయంలో పెరుగుదల ఎక్కువగా జరుగుతుంది. మరో వర్గ ఆదాయంలో పెరుగుదల ఉండదు. అందువల్ల ఆదాయాల అసమానతలు పెరుగుతాయి. పికెటీ గుర్తించిన అసమానతల పెరుగుదలకు కారణం ఇదే.

అదే విధంగా సంపదలో వ్యత్యాసాలు కూడా అమాంతం పెరిగిపోయాయి. మరీ ముఖ్యంగా దక్షిణార్థ భూగోళంలోని దేశాల్లో ఇది బాగా కనిపిస్తుంది. క్రెడిట్ స్విస్ గణాంకాల ప్రకారం అయితే అమెరికాలో కూడా 2000 - 2021 మధ్య కాలంలో సంపదలో అసమానతలు పెరిగిపోయాయి. అయితే..ఇండియాలో, బ్రెజిల్‌లో ఈ అసమానతలు పెరిగినంతగా అమెరికాలో జరగలేదు. సంపద అసమానతల అంచనాలు పాచికలాటలో మాదిరిగా నిరంతరం మారిపోతూంటాయి. స్టాక్‌మార్కెట్‌లో షేర్ల ధరలు మారిపోతూ వుండడమే దీనికి కారణం. వాస్తవ సంపదలో ఎటువంటి పెరుగుదలా లేకపోయినా, స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరలు ఊపుగా పైకి పెరుగుతూంటే అప్పుడు సంపద అంచనాలు అమాంతంగా పెరిగిపోతాయి. షేర్ మార్కెట్‌లో ఎక్కువగా పాల్గొనేది సంపన్నులే గనుక వారి సంపద మరీ ఎక్కువగా పెరిగిపోతుంది. దాని వల్ల సంపద అసమానతలు కూడా పెరిగిపోతాయి. అదే స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరలు పతనమైతే అప్పుడు సంపద అసమానతలు కూడా తగ్గుతాయి. ఇండియాలో అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక శాతం వ్యక్తుల సంపద 2000లో 32 శాతం ఉండగా...అది 2021లో 40.6 శాతానికి పెరిగింది. అదే కాలంలో బ్రెజిల్‌లో ఇది 43 శాతం నుండి 49.3 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదలకు తాత్కాలికమైన స్టాక్ మార్కెట్ ప్రభావాలు కారణం కావు. అంతకన్నా మౌలికమైన కారణాలున్నాయి.

అటువంటి ఒక మౌలిక కారణం ఆదాయాల్లో అసమానతలు పెరగడం. ఆదాయాల్లో అసమానతలు పెరగడం అంటే అదనపు విలువలో పెట్టుబడిదారుల వాటా పెరగడం. ఇలా పెరిగిన వాటా తిరిగి పెట్టుబడి పెట్టి ఆస్తులు అదనంగా పొందాలని అనుకోనవసరం లేదు. పొదుపు చేయడం ద్వారా కూడా జరగొచ్చు. ఒక దేశంలో పోగుబడిన పొదుపు మరో దేశంలో పెట్టుబడి పెట్టడానికి ఉపయోగపడవచ్చు. ఆ విధంగా పెట్టిన పెట్టుబడి ద్వారా తన జాతీయ ఆదాయాన్ని పెంచుకోగలుగుతుంది. జాతీయ ఆదాయంలో సంపన్నుల వాటా పెరుగుతోంది గనుక అప్పుడు సంపన్నుల సంపద కూడా పెరుగుతుంది. దేశంలో పోగుబడే పొదుపులో కూడా సంపన్నుల వాటా మరింత ఎక్కువగా పెరుగుతుంది గనుక ఆ విధంగా చూసినా అది సంపద అసమానతల పెరుగుదలకు దారితీస్తుంది. ఆ విధంగా ఆదాయాల్లో పెరిగే అసమానతలు సంపదలో అసమానతల పెరుగుదలకు దారి తీస్తాయి.

ఇక సంపదలలో అసమానతల పెరుగుదలకు ఇంకో కారణం కూడా ఉంది. దానినే మార్క్స్‘ పెట్టుబడి కేంద్రీకరణ’ అంటాడు. సాంకేతిక మార్పుల కారణంగా, వ్యవస్థీకృత మార్పుల కారణంగా వ్యాపారం చిన్న పెట్టుబడి నుండి పెద్ద పెట్టుబడి వైపు మారుతుంది. కొత్తగా కనుగొనే ఉత్పత్తి ప్రక్రియలు, వాటి ద్వారా వచ్చే ఉత్పత్తులు అంతకంతకూ ఎక్కువ పెట్టుబడి పెట్టవలసివచ్చేవిగా ఉంటాయి. వాటిని ఉత్పత్తి చేయగల శక్తి పెద్ద పెట్టుబడికే ఉంటుంది. అందువల్ల వ్యాపారం చిన్న పెట్టుబడి నుండి పెద్ద పెట్టుబడి చేతుల్లోకి క్రమంగా పోతుంది.

దీని పర్యవసానంగా కూడా ఉత్పత్తిలో పోగుబడే మిగులులో అంతకంతకూ ఎక్కువ వాటా పెద్ద పెట్టుబడి చేతుల్లోకి కేంద్రీకృతం అవుతూ వుంటుంది. ఆర్థిక వ్యవస్థలో జరిగే పొదుపులో కూడా పెద్ద పెట్టుబడిదారుల వాటా పెరుగుతుంది. ఆ విధంగా పెట్టుబడి కేంద్రీకరణ జరుగుతున్న కొద్దీ దానితోబాటు సంపద కేంద్రీకరణ కూడా జరిగిపోతూ వుంటుంది.

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఉత్పత్తి సామర్థ్యం కనీస స్థాయి కన్నా పెట్టుబడి తక్కువగా ఉంటే...అప్పుడు పరిస్థితి ఏమిటి ? మార్కెట్లోకి విడుదలైన సొమ్ము తక్కువగా ఉండి మార్కెట్లోకి వచ్చిన సరుకు ఎక్కువగా ఉంటే పెట్టిన పెట్టుబడిని తిరిగి రాబట్టుకోవడం ఒక సమస్య అవుతుంది కదా ? తగినంత డిమాండ్ లేనప్పుడు ఆ విధంగా జరుగుతుంది. కాని దాని ప్రభావం చిన్న పెట్టుబడిదారులమీద, పెద్ద పెట్టుబడి దారులమీద ఇలా అందరి మీదా పడుతుంది. అందువల్ల దాని కారణంగా సంపద కేంద్రీకరణ ధోరణిలో మార్పు రాదు.

సంపద కేంద్రీకరణకు సంబంధించి మార్క్స్ ప్రస్తావించిన మూడో అంశం ఆదిమ సంచయం. అంటే అనాగరిక కాలంలో మాదిరిగా కొల్లగొట్టి దోచుకోవడం. రైతులనుండి పెట్టుబడిదారులు భూములను నామమాత్రపు ధరలకో, లేక ఏమీ చెల్లించకుండా కూడా లాక్కోవడం ఈ మాదిరి విధానమే. అలా లాక్కున్న భూముల ధరలు ఆ తర్వాత మార్కెట్లో మళ్ళీ టౌన్‌షిప్‌ల నిర్మాణం కోసమో, ఇతర వినియోగాల కోసమో అమ్మినప్పటికీ వాటి ధరలు విపరీతంగా పెరిగిపోతాయి. స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరలు ఒకసారి పైకి, ఇంకోసారి కిందకి పడి, లేస్తూంటాయి. కాని భూముల ధరలు సాధారణంగా ఆ విధంగా పడిపోవు. అందుచేత మనం భూసేకరణను కూడా ఆదిమ సంచయంలో భాగంగానే చూడాలి. భూములు పోగొట్టుకునే రైతులకు నామమాత్రపు ధర దక్కుతుంది. పెట్టుబడిదారులు ఆ భూములను దక్కించుకున్నాక వాటి రేట్లు బాగా పెరుగుతాయి. అంటే వారి సంపద ఈ ప్రక్రియలో పెరుగుతుంది. ఇదీ సంపద కేంద్రీకరణలో భాగమే.

అనేక మార్గాల ద్వారా ఇప్పుడు ప్రజల ఉమ్మడి సంపద అప్పనంగా బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారు. ఆర్థికవృద్ధిని ప్రోత్సహించడం పేరుతో వాళ్లకు "ప్రోత్సాహకాలు" ఇస్తున్నామంటూ ఈ పని చేస్తున్నారు. ఆ వృద్ధి వల్ల అన్ని తరగతుల ప్రజానీకానికీ లబ్ధి చేకూరుతుందని నమ్మబలుకుతున్నారు. కానీ నిజానికి దాని వల్ల సంపదలో అసమానతలు మాత్రం బాగా పెరుగుతున్నాయి. మతఘర్షణలు రెచ్చగొట్టడం, రక్తపాతం సృష్టించడం కూడా సంపద కేంద్రీకరణకు దారి తీస్తుంది. ఒకసారి మతఘర్షణలు జరిగితే, దాని కారణంగా అక్కడ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు ఇక ఉండలేక ఖాళీ చేసి వెళ్లిపోతారు. అప్పుడు ఆ స్థలాలను బడా పెట్టుబడిదారులు నామమాత్రపు ధరలకే కాజేస్తారు.

ఈ విధంగా నయా ఉదారవాద విధానాలు అడ్డగోలుగా సంపదలో అసమానతల పెరుగుదలకు కారణం అవుతాయి. కార్పొరేట్ల దగ్గర సంపద పోగుబడితే అది సమాజానికే మేలు అన్న ప్రచారంతో ఆ విధానాలను పాలకవర్గాలు సమర్థిస్తాయి. మరోవైపు ప్రజల ఉమ్మడి సంపదగా ఉన్న ప్రభుత్వ రంగం మీద అన్ని రకాలుగా బురద జల్లి ఆ సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని కూడా సమర్థించుకుంటారు.

(స్వేచ్ఛానువాదం)

జనవాక్యం

బిజెపి వాదనలో హేతుబద్ధత ఏదీ?

విభజన హామీల అమలు విషయంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది. అయినా ఆ పార్టీ నేతలు ఇంకా వితండ వాదన మానలేదు. అధికారంలోకి వచ్చాక ఆ హామీ చట్టంలో పెట్టలేదు కనుక అమలు చేయలేమన్నారు. హామీ పొందిన రోజు చట్టంలో పెట్టాలని ఎందుకు అడగలేదు? ఆనాడు బిల్లుకు బిజెపి ఆమోదం తప్పనిసరి! అయినా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకి అవుతుందన్న ఆలోచనతో విభజన చట్టానికి సవరణ తీసుకు వచ్చి తెలంగాణాకు చెందిన తొమ్మిది మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు కలిపారు అసలు ప్రత్యేక హోదా అనేది ఇకపై ఏ రాష్ట్రానికి ఉండదని నమ్మబలికి అప్పటి వరకు ఏ రాష్ట్రాలైతే ప్రత్యేక హోదాను కలిగి వున్నాయో వారికి ఇస్తున్న రాయితీలు కొనసాగిస్తున్నారు ! ప్రత్యేక ప్యాకేజీకి కూడా సమస్యలు రాకుండా ఉండేందుకు ముందు చూపుతో చట్టబద్ధత కల్పించమని నాటి చంద్రబాబు ప్రభుత్వం కోరారు. అయితే అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అంగీకరించలేదు. ఇది ముమ్మాటికీ మోసపూరితమే. రాష్ట్ర విభజన హామీల్లో ఏ ఒక్కటీ కూడా సమగ్రంగా, సంతృప్తికరంగా అమలు చేసింది లేదు. కేంద్ర పాలకులు రాజకీయ సంకుచిత ఆలోచనలతోనే పాలన సాగిస్తున్నారు. దేశ విశాల ప్రయోజనాలు కాపాడాలన్న బుద్ధి కుశలత వారిలో లోపించింది. అందుకు తగిన మూల్యం తప్పదు చెల్లించుకోవాల్సి వస్తుంది!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు

స్కాలర్‌షిప్పులు నిలిపివేత తగదు

కేంద్ర ప్రభుత్వం 1నుండి 8 తరగతి వరకు చదివే ఓబిసి., ఎస్.సి.,ఎస్.టి., మైనార్టీలకుస్కాలర్‌షిప్పులు నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడం దారుణం...ఈ తరగతులకు చెందినవారు సామాన్యులు. వారి అభ్యున్నతికి నియమించిన కమిషన్ల నివేదికలను బుట్టదాఖలుచేసిన కేంద్రం..చివరకు వారికి గత కొన్నేళ్లుగా ఇస్తున్న స్కాలర్‌షిప్పులను నిలిపివేయాలనుకోవడం సముచితమైన నిర్ణయం కాదు. విద్యాహక్కు చట్టం అమలు తీరుపై పూర్తిస్థాయిలో సమీక్ష చేయకుండా..ఆ నెపంతో స్కాలర్‌షిప్పులు ఆపివేయాలన్న నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలి.

-షేక్ షబ్బీర్, కనిగిరి

ఆరోగ్య భద్రత అందరికీ అవసరం

కామెంట్

ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివద్ధి లక్ష్యాల్లో భాగంగా భారతదేశంలో అందరికీ ఆరోగ్య భద్రత అవసరం ఉంది. 2030 నాటికి ఈ లక్ష్యం చేరాలని నిర్ణయించుకున్నారు. అయితే నేటికీ మనదేశంలో 41% శాతం లోపు మాత్రమే ఆరోగ్య భద్రత అందుకున్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఇటీవల తెలిపింది. దీనిలో 30% శాతం మహిళలు, 37% శాతం మగవారు ఆరోగ్య భద్రత కలిగి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మనదేశంలో సిక్కు, ముస్లిం మైనారిటీల ప్రజలు , ఇతర బడుగు బలహీన వర్గాల ప్రజలు , గిరిజన ప్రజలు ఆరోగ్య భద్రతలో అట్టడుగున ఉన్నారు. యూనివర్సల్ హెల్త్ కవరేజ్ (యు.హెచ్.సి) అందరికీ అందుబాటులోకి తేవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నది. .ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ బడ్జెట్లో నిధులు ఎక్కువగా కేటాయించాలి. 2018 సెప్టెంబర్‌లో ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకం ప్రవేశ పెట్టినా, 2020, 21లో కరోనా కాలంలో ఎన్ని ప్రాణాలు గాల్లో కలిసిపోయాయో ఇకనైనా సమీక్ష చేసుకోవాలి. పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా ఆరోగ్య భారత్ ని నిర్మించలేము. ఆరోగ్య భారత్, ఆయుష్మాన్ భారత్ అనే పేర్లతో అందరికీ ఆరోగ్యం అని కేంద్ర ప్రభుత్వం పథకం పెట్టినా... ప్రజలకు వైద్య సేవలు ఎంత 'చౌకగా' అందుతున్నాయో అందరికీ తెలిసిందే. తగినన్ని సదుపాయాలు, వైద్యులు, ఆసుపత్రులు, ఆర్థిక పరిపుష్టత ద్వారానే ఇవి సాధ్యం అని గ్రహించాలి. పరిశోధన, అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలి. శాస్త్రీయ విజ్ఞానం కలిగించే విధంగా పాఠ్యాంశాలుండాలి. మూఢ నమ్మకాలు ప్రబోధించే వారిని దూరంగా ఉంచాలి.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగినన్ని సదుపాయాలు, వైద్యులు లేరు. కనీసం అన్ని రకాల రక్తపరీక్షలు, ఎక్స్ రే, స్కానింగ్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు లేవు. స్పెషలిస్ట్ డాక్టర్లు లేరు. అందువల్లే ప్రతీ ఒక్కరూ ప్రతీ చిన్న అనారోగ్యానికి ప్రైవేటు, కార్పోరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ, జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. అక్కర్లేని పరీక్షలు చేస్తూ డబ్బులు దోచుకుంటున్న వైనం సర్వసాధారణంగా కనిపిస్తుంది. కోవిడ్



కాలంలో డోలో 650 మాత్రలు, జింక్ సప్లిమెంటరీ వంటి టాబ్లెట్లు ద్వారా డాక్టర్లు, ఫార్మా కంపెనీలు ఎన్ని కోట్ల రూపాయలు ఆర్జించారో... ఇటీవల పలు నివేదికలు చెబుతున్నాయి. ప్రజల్లో చాలా మందికి దాదాపు 87% మందికి ఆరోగ్య భద్రత చేకూర్చడంలో దేశంలోనే కేరళ, రాజస్తాన్, ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో ఉండగా, బీహార్ 17% శాతం ప్రజలకు, డబుల్ ఇంజన్ సర్కారు అని చెబుతున్న ఉత్తర ప్రదేశ్ 16% శాతం మంది ప్రజలకు మాత్రమే ఆరోగ్య భద్రత చేకూర్చటం జరిగిందని నివేదికలు చెబుతున్నాయి. నార్వేస్వీడన్, ఫిన్లాండ్ వంటి దేశాలను ఆదర్శంగా తీసుకుని మన ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన విద్య వైద్యం అందించేందుకు కృషి చేయాలి. క్యూబా, వియత్నాం వంటి దేశాలు ఎలా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నాయో, మనం కూడా ఆ బాటలోనే పయనించాలి. అప్పుడు మాత్రమే మన స్వాతంత్ర్య సమర యోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన విద్య వైద్యం అందరికీ అందుతుంది.వాస్తవంగా ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉంచి, అందరికీ అందుబాటులోకి తేవాలి. తద్వారానే దేశం అబివృద్ధి చెందుతుందని ప్రభుత్వాలు గ్రహించాలి.

-ఐ.ప్రసాదరావు 6305682733

మూఢ నమ్మకాల పట్ల అప్రమత్తత

దేశ వ్యాప్తంగా పటిష్టమైన మూఢ నమ్మకాల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని జన విజ్ఞాన వేదిక వంటి సైన్స్ ప్రచార సంస్థలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. కానీ ప్రభుత్వాల నుండి ఆశించిన విధంగా సానుకూల స్పందన రావడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజుల్లోనూ మూఢ నమ్మకాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని చెప్పడంలో ఏ మాత్రమూ సందేహం లేదు.

సాక్షాత్తూ మంత్రిగా పనిచేసిన పాలేటి రామారావు తన మరణ తేదీని తానే నిర్ణయించుకుని, దానికి సంబంధించిన వేడుకలు ఘనంగా చేసుకోవాలని అందరికీ ఆహ్వాన పత్రాలు పంపడం, హైదరాబాద్ లో ఓ వ్యక్తి తన ఇంట్లోనే తన సమాధిని నిర్మించు కోవడం, ఇంకో మత ప్రబోధకుడు తాను జీవించి ఉండగానే సమాధి చేయమని అడగటం, ఏసుక్రీస్తులా తాను కూడా మూడవ రోజు తిరిగి సమాధి నుండి బయటకు వస్తానని చెప్పడం, తోడి కోడళ్ల హత్యకేసులో నాటువైద్యురాలి పాత్ర ఉండటం తదితర ఘటనలను పరిశీలిస్తే మూఢ నమ్మకాలు పరాకాష్టకు చేరాయని అనిపిస్తుంది. గతంలో బాబాలు, స్వామిజీలు, కొందరు మత ప్రచారకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం అయ్యేవారు.ప్రజలకు కొంత వరకు నైతిక విలువలు కూడా బోధించేవారు. ఇప్పుడు వీరిలో కొందరు వివిధ వ్యవస్థల్లోకి జొరబడి ప్రత్యక్షంగా రాజకీయాలని శాసిస్తున్నారు. పాలకులు కూడా వీరిని తరచుగా కలుస్తున్నారు. టీవీల్లో ఇటువంటి వారి ప్రసంగాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇంకో వైపు భూత వైద్యం వంటి కోర్సులను కొన్ని విశ్వ విద్యాలయాల్లో ప్రవేశ పెడుతున్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు కూడా వివిధ ఉపగ్రహాలను పంపించే సమయంలో దేవతలకు పూజలు చేస్తున్నారు.

ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న మూఢ నమ్మకాలని నియంత్రణ చేయాలంటే పటిష్టమైన మూఢ నమ్మకాల నియంత్రణ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలి. మూఢ నమ్మకాల గురించి పాఠ్యపుస్తకాలలో పొందుపరచాలి. వీటిపై అవగాహన తరగతులు నిర్వహించాలి.నమ్మకానికి, మూఢ నమ్మకానికి మధ్య తేడా ఉంటుంది. దైవాన్ని నమ్మేవారు కూడా మానవ ప్రయత్నం ద్వారానే వివిధ కార్యకలాపాలు సజావుగా జరుగుతాయని విశ్వసించి పని చేస్తారు. అయితే తరచుగా సరైన కార్యాచరణ లేకపోవడంతో వివిధ పనుల్లో విఫలమైన కొందరు సులభ మార్గాలని ఎంచుకుంటారు. ఈ క్రమంలో వారు మూఢ నమ్మకాలని ఆశ్రయిస్తారు. అలాగే వివిధ ఆర్థిక,కుటుంబ,సామాజిక సమస్యలతో బాధపడే వారు కూడా ఉపశమనం కోసం మూఢ నమ్మకాలని ఆశ్రయిస్తారు. ఈ క్రమంలో వారు మరింతగా నష్టపోతున్నారు.

దైవాన్ని నమ్మడం, వివిధ సంప్రదాయాలని, ఆచారాలని పాటించడం, తీర్థయాత్రలు చేసుకోవడం, పండుగలను జరుపుకోవడం వంటివి ప్రజలకు మత స్వాతంత్ర్యపు హక్కులో భాగంగా వస్తాయి. ఆ మేరకు వారికి రాజ్యాంగ పరమైన రక్షణ కూడా ఉంటుంది. కానీ వివిధ పండుగల పేరుతో శబ్ద కాలుష్యం... తాము నమ్మిన భావజాలాన్ని ఎదుటి వారిపై బలవంతంగా రుద్దటం, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసే వారిపై దాడులు చేసేందుకు ప్రయత్నం చేయడం వంటివి సరైన చర్యలు అనిపించుకోవు. మూఢ నమ్మకాల నియంత్రణ కు పటిష్టమైన చట్టాలతో పాటు, ప్రజల్లో చైతన్యం పెంచడానికి నిరంతరం కార్యక్రమాలు చేపట్టాలి.అయితే దైవం,మతం వంటి విషయాలు సున్నితమైన విషయాలుగా మారిన ప్రస్తుత కాలంలో సైన్స్ వాదులు, నాస్తికులు తాము చెప్పే విషయాల పట్ల కూడా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వారి ప్రసంగాలలో ఎక్కడా కూడా అవహేళన, ఎగతాళి చేసే మాటలు లేకుండా చూసుకోవాలి. అలాగే ప్రజలు ఎదుర్కొనే వివిధ సమస్యలకు ప్రభుత్వాలు సరైన పరిష్కార మార్గాలు చూపించాలి. మూఢ నమ్మకాల నియంత్రణ కోసం దీర్ఘకాలిక ఉమ్మడి కృషి అవసరమని అందరూ గుర్తించాలి.అప్పుడే ప్రజలు మూఢ నమ్మకాల ప్రవాహంలో కొట్టుకొని పోకుండా ఉంటారు.

-యం. రాం ప్రదీప్, తిరువూరు
9492712836

కవిత్వం

జెండా కర్ర

ఆ జెండా కర్ర
నిలువునా పాతుకుపోతే
సగటు దరిద్రం పోయిందనుకున్న

ఆ అజెండా రంగులు
వ్యవస్థ నిండా పరుచుకునిపోతే
కాలం మారిందనుకున్న

ఆ పథకావిష్కరణలు
పెద్ద పెద్ద అక్షరాలతో
మెరుస్తూ కనిపిస్తుంటే
చీకటి తొలిగిందనుకున్న

ఆ వాగ్దానాలన్నీ
వేల గొంతులై పేలుతుంటే
పేగులు నిండుతాయనుకున్న

ఆ ప్రచారమంతా
ఆచారం లెక్కన అగుపిస్తే
గ్రహచారం తొలిగిందనుకున్న

చెప్పిన కాడ ముద్ర వేసి
వెనక్కి తిరిగి చూసుకుంటే
కల మెళుకువలోకి వచ్చింది
వాస్తవం కళ్ళల్లో కదలాడింది
ఇదంతా భ్రమనుకున్న

-నరెద్దుల రాజారెడ్డి
ఫోన్: 9666016636

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

కర్ణాటక సరిహద్దుల్లో మహారాష్ట్ర బృందం అడ్డగింత



బెళగావి : మహారాష్ట్ర నుంచి వస్తున్న ప్రతినిధుల బృందాన్ని కర్నాటకలో ప్రవేశించకుండా బెళగావి జిల్లాలో పోలీసులు అడ్డుకున్నారు. బిజెపి, శివసేన (ఏక్‌నాథ్ షిండే)కు చెందిన సభ్యులతో కూడిన మహారాష్ట్ర బృందాన్ని బెళగావి జిల్లాలోని కుగనోలి గ్రామంలో దూద్ గంగ నది వంతెనపై సోమవారం కర్ణాటక పోలీసులు నిరోధించారు. వంతెనపై రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను ఉంచారు. జిల్లా యంత్రాంగం నిషేధ ఉత్తర్వులు జారీ చేసినందున ఈ ప్రాంతం నుంచి వెనక్కి తిరిగి వెళ్లాలని మహారాష్ట్ర బృందానికి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రమణగౌడ హట్టి విజ్ఞప్తి చేశారు. కర్ణాటక పోలీసుల విజ్ఞప్తిని మహారాష్ట్ర నాయకులు పట్టించుకోలేదు. పైగా కర్ణాటక ప్రభుత్వం, కర్ణాటక సంస్థలకు వ్యతిరేకంగా మహారాష్ట్ర నాయకులు నినాదాలు చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పాటు, సుమారు 90 నిమిషాల పాటు ట్రాఫిక్ స్థంభించింది. చివరికి మహారాష్ట్ర బృందాన్ని ఆ రాష్ట్ర పోలీసులు వెనక్కి తీసుకుని వెళ్లడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

రాజ్యాంగంపై దాడి, అమిత్‌షాకు అవమానం

మహారాష్ట్ర నాయకుల బృందాన్ని కర్ణాటక పోలీసులు అడ్డుకోవడం, రాష్ట్ర ఎంపి ధైర్యశీల్ మానే పర్యటనపై బెళగావి జిల్లా యంత్రాంగం నిషేధం విధించడాన్ని శివసేన ఎంపి అరవింద్ సావంత్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను భారత రాజ్యాంగంపై దాడిగాను, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు జరిగిన అవమానంగాను సావంత్ అభివర్ణించారు. ఈ అంశాన్ని సోమవారం లోక్‌సభలో జీరో అవర్‌లో దక్షిణ ముంబయి ఎంపి అరవింద్ సావంత్ లేవనెత్తారు.

ఈ వివాదంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా జోక్యం చేసుకోవాలని, కర్ణాటక పోలీసుల నుంచి మహారాష్ట్ర నాయకులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక, మహారాష్ట్రల మధ్య సరిహద్దు వివాదాన్ని రాజ్యాంగ మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బసవరాజ్ బొమ్మై, ఏక్‌నాథ్ షిండేకు అమిత్ షా సలహా ఇచ్చిన తరువాతే ఈ అడ్డుకోవడం జరగడంతో సావంత్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. 'అమిత్ షా సలహాను కర్ణాటక ముఖ్యమంత్రి పాటించడం లేదు. మేము దానిని తీవ్రంగా ఖండిస్తున్నాము. ఈ విషయంపై కేంద్ర హోం మంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని సావంత్ తెలిపారు.

బెయిల్ పిటిషన్ల పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయిన నలుగురు నిందితులు బెయిల్ మంజూరు చేయాలని వేరు వేరుగా పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. బినోయ్ బాబు బెయిల్ పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేయాలని గతంలో జడ్జీ నాగ్ పాల్ ఆదేశాలిచ్చారు. దీనిపై సోమవారం ఈడీ తరపు సీనియర్ అడ్వకేట్ నవీన్ కుమార్ మట్ట 59 పేజీల నివేదికను ధర్మాసనానికి అందించారు. అయితే ఈ నివేదికను స్టడీ చేసేందుకు సమయం కావాల్సి ఉండడంతో తదుపరి విచారణను జనవరి 9కి వాయిదా వేశారు. అలాగే, అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్ బెయిల్ పిటిషన్లపై విచారణను జనవరి 4 వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. కాగా, గత శనివారం(డిసెంబర్ 17) శరత్ చంద్రా బెయిల్ పిటిషన్ పై విచారణ ను జనవరి 7 కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే.

శరత్‌చంద్రారెడ్డికి 14 రోజులు రిమాండ్ పొడిగింపు

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టు అయిన అరబిందో శరత్ చంద్రా రెడ్డి, అభిషేక్ బోయినపల్లి, బినోయ్ బాబు, విజయ్ నాయర్ల కు సిబిఐ స్పెషల్ కోర్టు మరో 14 రోజులు జ్యూడీషియల్ రిమాండ్ పొడగించింది. మద్యం కుంభకోణంలో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అరెస్ట్ చేసిన ఈ నలుగురు నిందితులు ప్రస్తుతం తీహార్ జైళ్లో ఉన్నారు. గతంలో కోర్టు ఈ నలుగురికి విధించిన జ్యూడిషియల్ రిమాండ్ సోమవారంతో ముగిసింది. దీంతో అభిషేక్ బోయినపల్లి, శరత్ చంద్రారెడ్డి, బినోయ్‌బాబు, విజయ్ నాయర్ లను ఈడీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిబిఐ స్పెషల్ కోర్టు జడ్జీ ఎంకె నాగ్ పాల్ ముందు హాజరుపరిచారు.

పెరూ నిరసనలపై అణచివేత

- 25మంది మృతి

లిమా : తక్షణమే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ, పెరూ అధ్యక్షురాలు దినా బొలుర్టేకు వ్యతిరేకంగా గత వారం రోజులుగా కొనసాగుతున్న నిరసనల్లో 25మంది మరణించారని పెరూ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. మొత్తంగా ఆరు ప్రాంతాల్లో 25మంది చనిపోయారని అధికారిక డేటా పేర్కొంటోంది. మరో 287మంది గాయపడ్డారని, వారు ఆస్పత్రుల్లో చికిత్సలు తీసుకుని డిశ్చార్జ్ కూడా అయ్యారని ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. మరో 69మంది ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. సామాజిక నిరసనల సందర్భంగా చోటు చేసుకున్న పౌరుల మరణాలపై ప్రజా మంత్రిత్వశాఖ దర్యాప్తు చేపట్టనున్నట్లు అధ్యక్షురాలు ప్రకటించారు. ప్రజల ఆందోళనలపై హింసాత్మక అణచివేత చర్యలతో విభేదిస్తూ ఈ నెల 16న ముగ్గురు మంత్రులు రాజీనామా చేశారు. వారి స్థానంలో కొత్తవారిని మంగళవారం నియమించనున్నట్లు అధ్యక్షురాలు దినా తెలిపారు. అధ్యక్షుడు పెడ్రో కేస్టిలోను తొలగించిన తర్వాత దినా బొలుర్టేను అధ్యక్షురాలిగా పార్లమెంట్ నియమించడంతో ఈ నెల 7వ తేదీ నుంచి పెరూలో పెద్ద ఎత్తున నిరసనలు పెల్లుబుకుతున్నాయి.

లోక్‌సభలో యాంటీ మారిటైమ్ పైరసీ బిల్లు ఆమోదం

- సరిహద్దు ఘర్షణలపై రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో యాంటీ-మారిటైమ్ పైరసీ బిల్లు ఆమోదం పొందింది. బిల్లుపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మాట్లాడుతూ ఎవరైనా పైరసీకి పాల్పడితే, పరిస్థితుల స్వభావాన్ని బట్టి జరిమానా, జైలుశిక్ష, మరణశిక్ష విధించవచ్చని తెలిపారు. రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అప్రాప్రియేషన్ బిల్లు-2022ను ప్రవేశపెట్టారు. చర్చ కొనసాగుతోంది. సరిహద్దుల్లో ఘర్షణలపై చర్చ జరగాలన్న డిమాండ్‌ను చైర్మన్ తిరస్కరించడంతో సోమవారం రాజ్యసభలో ప్రతిపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. రూల్ 267 కింద వచ్చిన తొమ్మిది నోటీసులు సక్రమంగా లేవని చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. దీనిని నిరసిస్తూ కాంగ్రెస్, వామపక్షాలు, డిఎంకె తదితర పార్టీల ఎంపిలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ చైర్మన్‌కు అన్ని అధికారాలు ఉన్నాయని, చర్చకు అనుమతించవచ్చని చెప్పారు.

టొరొంటోలో కాల్పులు : ఐదుగురి మృతి

టొరొంటో : కెనడాలోని టొరొంటో నగరంలో ఒక సాయుధుడు కాల్పులకు తెగబడటంతో ఐదుగురు మరణించారు. కాల్పులకు పాల్పడినట్లుగా భావిస్తున్న అనుమానితుడైన సాయుధుడ్ని పోలీసులు కాల్చి చంపారు. టొరొంటో శివారుల్లోని ఒక నివాస భవనంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.



అగర్తలలో సోమవారం ఐద్వా నేతృత్వంలో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న జనం.
ప్రసంగిస్తున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, మాణిక్ సర్కార్

డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో డబుల్ డిజాస్టర్

- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, మాణిక్ సర్కార్

అగర్తల : డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో డబుల్ డిజాస్టర్లు ఎదురవుతున్నాయని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, మాణిక్ సర్కార్ సోమవారం విమర్శించారు. సోమవారం అగర్తలలో ఐద్వా ఆధ్వర్యాన భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో బృందాకరత్, మాణిక్ సర్కార్‌తో పాటు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రామ దాస్ కూడా పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

4.56 లక్షల మంది యువత ఆత్మహత్య

- వంటగ్యాస్ సబ్సిడీలో రూ.30,345 కోట్లు కోత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో 4,56,208 మంది యువత గత మూడేళ్లలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో 21,575 మంది, తెలంగాణలో 25,904 మంది యువత ఆత్మహత్య చేసుకున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. నిరుద్యోగంతోపాటు వివిధ కారణాలతో యువతీ, యువకులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

రూ.30,345 కోట్లు తగ్గించిన వంటగ్యాస్ సబ్సిడీ

కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌కు ఇచ్చే సబ్సిడీని రూ.30,345 కోట్లు తగ్గించింది. ఈ మేరకు రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి సమాధానం ఇచ్చారు. 202-21లో గ్యాస్ సబ్సిడీకి కేంద్ర ప్రభుత్వం రూ.35.310 కోట్లు కేటాయించింది. అది 2021-22 నాటికి రూ.4,964 కోట్లకు, 2022-23 నాటికి రూ.4,865కు తగ్గించింది. అందువల్ల వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. వంటగ్యాస్ సిలిండర్ 2021 ఏప్రిల్ 1 నాటికి రూ.809 ఉంటే, అది 2022 జులై 6 నాటికి రూ.1,053కి పెరిగింది.

లాభాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు

దేశంలో 188 ప్రభుత్వ రంగ సంస్థలు లాభాల్లో ఉన్నాయని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి భగవత్ క్రిష్ణరావు కరద్ తెలిపారు. ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22లో లాభాలు ఆర్జిస్తున్న 188 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల మొత్తం లాభం గత ఆర్థిక గతేడాదితో పోలిస్తే రూ.2.64 లక్షల కోట్లుతో 39.85 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయని తెలిపారు.

ఏడాదిలో 24,240 పాఠశాలల మూత

ఏడాదిలో దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 24,240 పాఠశాలలు మూతపడ్డాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి అన్నపూర్ణా దేవి తెలిపారు. దేశంలో 2020-21లో 12,59,028 పాఠశాలలు ఉంటే, 2021-22 నాటికి 12,34,788 పాఠశాలలకు తగ్గాయని తెలిపారు. విద్యా వ్యాపారీకరణను నియంత్రించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని అన్నపూర్ణా దేవి తెలిపారు. విద్య రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలోని అంశమని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు, ప్రైవేట్ శక్తుల చేతుల్లో అధిక శాతం విద్య, పెరుగుతున్న విద్యా వ్యాపారీకరణకు సంబంధించిన విషయం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ నియమాలు, సూచనల ఆధారంగా నియంత్రించబడతాయని, వాటిని ఉల్లంఘించే పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

వ్యవసాయ పరికరాలపై 18 శాతం జిఎస్‌టి

వ్యవసాయ పరికరాలపై 18 శాతం జిఎస్‌టి విధించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ధాన్యం, ఎండిన పప్పు ధాన్యాల, కూరగాయల, పండ్లు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను శుభ్రపరచడం, గ్రేడింగ్ చేయడం, విత్తనాలు చల్లే యంత్రాలపై 18 శాతం జిఎస్‌టి విధించామని తెలిపారు. సాగు యంత్రాలపై 12 శాతం జిఎస్‌టి విధించినట్లు చెప్పారు.

రెండేళ్లలో 14,454 ఎంఎస్‌ఎంఇలు మూసివేత

దేశంలో ఈ రెండేళ్లలో 14,454 సూక్ష్మ, చిన్న మధ్య పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ)లు మూసివేతకు గురయ్యాయని కేంద్ర మంత్రి భాను ప్రతాప్‌సింగ్ వర్మ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021-22లో 6,222 పరిశ్రమలు మూసివేతకు గురవ్వగా, 2022-23 (డిసెంబర్ 14 వరకు) 8,232 పరిశ్రమలు మూసివేసినట్లు తెలిపారు.

త్రివిధ దళాల్లో 1,35,891 పోస్టులు ఖాళీ

దేశంలోని త్రివిధ దళాల్లో 1,35,891 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ తెలిపారు. ఇండియన్ ఆర్మీలో 2022 జులై 1 నాటికి 1,18,485 పోస్టులు, ఇండియన్ నావీలో 2022 సెప్టెంబర్ 30 నాటికి 11,587 పోస్టులు, ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో 2022 నవంబర్ 1 నాటికి 5,819 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

విజయవాడ, తిరుపతి, రాజమండ్రి ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తిరుపతి, రాజమండ్రి ఎయిర్‌పోర్టులను ప్రైవేటీకరణ చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి వికె సింగ్ తెలిపారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి ఎలమరం కరీం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022-25ల్లో నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్‌ఎంపి)లో భాగంగా దేశంలోని 25 ఎయిర్‌పోర్టులను ప్రైవేటీకరణ చేస్తామన్నారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎయిర్‌పోర్టులు మూడు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఎనిమిది ఎయిర్‌పోర్టులు ప్రైవేటీకరణ చేశామని అన్నారు.

పోలవరం పనుల చెల్లింపుల్లో జాప్యం లేదు

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులకు వెచ్చిస్తున్న సొమ్మును కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తిరిగి చెల్లిస్తోందని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు పేర్కొన్నారు. రాజ్యసభలో సోమవారం వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ 2014 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం రూ.15,970 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ మొత్తంలో ఆమోదయోగ్యమైనవిగా గుర్తించిన బిల్లులకు రూ.13,226 కోట్లు చెల్లింపు జరిగిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ పనుల బిల్లులను పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పిపిఎ), కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) తనిఖీ చేసి వాటి చెల్లింపుల కోసం సిఫార్సు చేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని వివరించారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ఆర్థిక శాఖ ద్వారా నిధులు మంజూరు చేయాలని 2016 సెప్టెంబర్ 30న ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అయితే ఆఫీసు మెమోరాండం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2014 ఏప్రిల్ 1 నుంచి కేవలం ఇరిగేషన్ కాంపోనెంట్ కింద అయిన ఖర్చు మాత్రమే భర్తీ చేయాల్సి ఉందని అన్నారు. ఆ ఖర్చును సమయానుసారం భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక అసెంబ్లీలో సావర్కర్ ఫొటో

(మొదటి పేజీ తరువాయి)

సర్దార్ వల్లభాయ్ పటేల్, బసవన్న, వివేకానంద, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సావర్కర్ చిత్ర పటాలను అసెంబ్లీ స్పీకర్ విశ్వేశ్వర్ హెగ్డే కాగెరి, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఆవిష్కరించారు.

అసెంబ్లీ ముందు కాంగ్రెస్ ప్రదర్శన

అంతకుముందు నెహ్రూ, బాబు జగ్జీవన్ రామ్, కువెంపు, నారాయణ గురు వంటి మరికొంతమంది నేతల ఫొటోలతో అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.కె.శివకుమార్ అసెంబ్లీ ముందు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డికె శివకుమార్ మాట్లాడుతూ కర్ణాటకకు, సావర్కర్‌కు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. సిద్ధరామయ్య మాట్లాడుతూ అసెంబ్లీలో చిత్రపటాలు పెట్టడంపై ఎలాంటి చర్చ జరపకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీలో ఒక చిత్రపటాన్ని పెట్టడమంటే అది అసెంబ్లీ ఆస్తిగా మారుతుందని, దానికి స్పీకర్ కస్టోడియన్‌గా వుంటారని, అది ఇక్కడ జరగలేదని అన్నారు. కనీసం సభా సంప్రదింపుల కమిటీలో కూడా చర్చకు నోచుకోలేదన్నారు. మీడియా ద్వారానే తమకు ఈ సమాచారం తెలిసిందని విమర్శించారు. అవినీతి, ఓటర్ ఐడి కార్డు కుంభకోణం, రైతుల సమస్యలు, శాంతి భద్రతల సమస్య ఇలా పలు అంశాలను తాము లేవదీస్తుండగా, ప్రజల దృష్టిని మళ్లించేందుకే బిజెపి ప్రభుత్వం ఇటువంటి చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.

విభజన సమస్యల పరిష్కారంలో కేంద్ర విఫలం

(మొదటి పేజీ తరువాయి)

మెలిక పెడుతూ అరకొర నిధులతో కేంద్ర ప్రభుత్వం పీకనులిమేస్తుంటే పోలవరం ప్రాజెక్ట్ ఎలా పూర్తవుతుందని కేంద్రాన్ని నిలదీశారు. రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు పెంచాలని, సామాన్యుడిపై పెను భారంగా మారిన పెట్రోల్, డీజిల్ ధరలపై పన్నులు తగ్గించాలని కోరారు. కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖలు, కేంద్ర శాఖల్లో 10 లక్షల ఉద్యోగ ఖాళీలున్నాయని, ఈ ఏడాది నవంబర్ నాటికి పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం 9 శాతానికి చేరిందని తెలిపారు. ప్రభుత్వ ఎరువుల పరిశ్రమలను ఎలా ప్రైవేటీకరిస్తారని ప్రశ్నించారు. తలసరి ఆదాయం క్షీణిస్తోందని అన్నారు.





మీకోసం


వెల్లుల్లిని బాగా నూరి గంటకోసారి వాసన పీలుస్తూ ఉంటే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం కలుగుతుంది.

జీవన సౌరభం

భయంతో ఏ పనిచేసినా విజయాన్ని సాధించలేము.. వివేకంతో చేసే పని సత్ఫలితాన్నిస్తుంది.

ఆధునిక భౌతిక శాస్త్ర పితామహుడు గెలీలియో

పిల్లలూ, ప్రతి వివాదంలోనూ ప్రయోగాత్మక పద్ధతికి, ప్రకృతి, వస్తుగత దృష్టికి ప్రాధాన్యతనిస్తూ ఆధునిక శాస్త్రీయ పద్ధతికి పునాదులు వేసిన శాస్త్రవేత్త గెలీలియో గెలీలీ. ఆయన గురించి ఈ రోజు తెలుసుకుందామా!



ఇటలీలోని పీసా నగరంలో 1564లో ఫిబ్రవరి 15వ తేదీన జన్మించారు. అస్తికత, దైవచింతన బలంగా ఉన్న ఇంట్లో పెరిగినా బాల్యంలోనే సైన్సుకు ఆకర్షితుడైనాడు. గెలీలియో తన ఇంట్లో వాళ్లతో పాటు ప్రతీ ఆదివారం చర్చికి వెళ్లేవాడు. ఒకసారి చర్చిలో ప్రార్థన జరుగుతోంది. అంతలో ప్రవచకుడి వెనుక అటు ఇటు ఊగుతున్న ఓ దీపం ఆయన కంటపడింది. ఆ దీపం ఓ పొడవాటి గొలుసుకి వేలాడుతోంది. దీపం ఒకసారి అటు ఇటు ఊగడానికి ఎంత సేపు పడుతుందో తెలుసుకోవాలని అనిపించింది. దగ్గర్లో ఎక్కడా గడియారం కనిపించలేదు. తన ముంజేతి నాడినే గడియారంగా వాడుకుని దీపం ఒకసారి ఊగడానికి ఎంత సేపు పడుతుందో లెక్కపెట్టాడు. ఈ విషయంలో లోతుగా శోధించారు. లోలకం యొక్క ఆవర్తక కాలం కేవలం అది కట్టబడ్డ తాడు పొడవు మీదే ఆధారపడుతుందని కనిపెట్టారు. నాడి చూసి రోగి యొక్క ఆరోగ్య స్థితి గురించి తెలుసుకునేటప్పుడు ఆ నాడి వేగాన్ని కచ్చితంగా కొలవడానికి లోలకాన్ని వాడడం మొదలెట్టాడు.

శాస్త్రవేత్త అంటే ప్రకృతి–మానవ జీవనానికి దగ్గర సంబంధాన్ని తెలుసుకోవాలని తపనపడేవారు. అందుకే వైద్యవిద్యను మధ్యలో వదిలేసి తన పరిశోధనకే ప్రాధాన్యత ఇచ్చారు. తాను కనిపెట్టిన విషయంపట్ల ఎన్నో ప్రశ్నలు వేసుకుని ఆధారాలు సేకరించేవారు. ప్రాచీన గ్రీకు తాత్వికుడు అరిస్టాటిల్ భావాలు బలంగా పాతుకుపోయిన రోజుల్లో గెలీలియో చెప్పే విషయాలు విని చాలా మంది మత ఛాందసవాదులు ఆయనమీదకు ధ్వజం ఎత్తారు. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించగలిగాడు. ఆయన కనిపెట్టిన సూత్రం ద్వారా బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను చూడగలిగారు. టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధ్రువీకరించారు. ప్రయోగాలతో శాస్త్ర సత్యాన్ని నిలబెట్టేందుకై ప్రాణాలని కూడా లెక్క చెయ్యకుండా మతవ్యవస్థతో తలపడ్డ ధీరాత్ముడు గెలీలియో.



దారి చూపండి

చిన్నారులూ, పప్పీ ఇంటికి వెళ్లే దారి మరిచిపోయింది. మరి దారి చూపి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ





- టి. కుందన,
6వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

స్ఫూర్తి నినాదం మెస్సీ

మెస్సీ.. మెస్సీ.. మెస్సీ.. లియోనెల్ మెస్సీ.. నేడు ప్రపంచమంతా మార్మోగుతున్న పేరిది. వాస్తవానికి ఫిఫా సాకర్ సంగ్రామం ఆరంభ సమయం నుంచీ ఈ ఏడాది ప్రపంచం నోట్లో నానుతున్న నామమిది. ఆదివారం రాత్రి దోహాలోని లుసైల్ స్టేడియంలో ఫ్రాన్స్‌పై అర్జెంటీనా గెలిచిన తరువాత ఈ పేరు క్రీడా శిఖరాలను స్పృశిస్తూ ఖండాంతరాలను తాకింది. ఇన్నాళ్లూ ఊరిస్తూ వచ్చిన సాకర్ వరల్డ్ కప్‌ను చేతిలోకి తీసుకుని మెస్సీ ముద్దాడగానే ప్రపంచం మురిసిపోయింది. అతడు తమ వాడే అన్నట్టు పొంగిపోయింది. అయితే, ఈ 35 ఏళ్ల అర్జెంటీనా మాస్ట్రో తన జీవన గమనంలో ఎన్నో ఆటుపోట్లును ఎదుర్కొన్నాడు. గ్రోత్ హార్మోన్ లోపంతో పొట్టివాడైన అతన్ని అనేక అవహేళనలు చుట్టిముట్టినా, చిరుతలా కదిలి వాటన్నంటినీ తన కాలితో గోల్‌పోస్టు అవతలికి తన్నిపారేశాడు. తను అనుకున్న 'గోల్స్'ను సాధించి గొప్ప ఆటగానిగా కీర్తిగడించాడు. చే గువేరా అంటే ప్రాణమిచ్చే మెస్సీ జీవితాన్ని పరికించి చూస్తే ఎన్నో విషయాలు స్ఫూర్తినిస్తాయి.





మెస్సీ 1987 జూన్ 24న అర్జెంటీనాలోని రోసారియోలో ఫుట్‌బాల్‌ను ఇష్టపడే కుటుంబంలో జన్మించాడు. నలుగురు పిల్లల్లో మూడో సంతానం మెస్సీ. తోబుట్టువులలో ఇద్దరు అన్నలు, ఒక చెల్లి ఉన్నారు. తండ్రి జార్జ్ మెస్సీ ఉక్కు కార్మికుడు. తల్లి సెలియామారియా కుసిట్టిని క్లీనర్. చిన్నతనం నుంచీ మెస్సీ ఫుట్‌బాల్ ఆడటం పట్ల గొప్ప అభిరుచిని పెంచుకున్నాడు. కుటుంబం నుంచి అతనికి మద్దతు దొరికింది. దీంతో నాలుగు సంవత్సరాల చిన్న వయస్సులోనే గ్రాండోలీ పేరుతో ఉన్న స్థానిక ఫుట్‌బాల్ క్లబ్‌లో చేరాడు. మైదానంలో తన తోటి ఆటగాళ్ల నుంచి ఫుట్‌బాల్‌ను త్వరగా పట్టుకుని, బంతిని చాలా నిమిషాల పాటు తన పాదాల ఆధీనంలోనే ఉండేటట్టు చూసేవాడు. సాల్వడార్ అపారిసియో తొలి గురువు. చిన్నతనంలో ప్రతి మ్యాచ్‌లో మెస్సీ ఆరు నుంచి ఏడు గోల్స్ చేసేవాడు. తన కంటే చాలా పెద్ద ఆటగాళ్లు ఉన్నప్పటికీ అతను బెదిరేవాడుకాదు. ఆరు సంవత్సరాల వయస్సులో అతను తన నగరం రోసారియోలో ఉన్న క్లబ్ అట్లెటికో నెవెల్స్ ఓల్డ్ బాయ్స్‌లో చేరాడు.

హార్మోన్ లోపంతో పొట్టివాడైనప్పటికీ..

మెస్సీ ఇతర ఆటగాళ్లతో పోల్చినప్పుడు చాలా చిన్నవాడు. ఇప్పటికీ సాకర్ ఆడే అన్ని జట్లలో పొట్టి ఆటగాడు. కానీ అది అతనిని సాకర్‌లో టాప్ స్కోరర్‌గా మారకుండా ఆపలేకపోయింది. చిరుప్రాయంలోనే మెస్సీ బాగా ప్రాచుర్యంపొందాడు. అనేక ఫుట్‌బాల్ క్లబ్‌లు అతనిని నిశితంగా పరిశీలించసాగాయి. మెస్సీకి పదేళ్లు వచ్చే వరకూ పరిస్థితి బాగానే ఉంది. ఎండోక్రినాలజిస్ట్ డియెగో స్క్వార్జ్‌స్టెయిన్ మెస్సీకి గ్రోత్ హార్మోన్ లోపం ఉన్నట్లు నిర్ధారించాడు. ఆ విషయం మెస్సీ కుటుంబానికి తెలిసి వారి ఫుట్‌బాల్ కలలన్నింటినీ బద్దలు చేసింది. వాస్తవానికి గ్రోత్ హార్మోన్ లోపం (జిహెచ్‌డి) అరుదైన రుగ్మత. దీంతో వ్యక్తి పొడవుగా ఎదగలేడు. మెస్సీని ఈ హార్మోన్ లోపం చుట్టుముట్టింది. చికిత్సలో భాగంగా అతని తల్లిదండ్రులు ప్రతిరోజూ రాత్రి గ్రోత్ హార్మోన్లను అతని కాళ్ళకు ఇంజెక్ట్ చేసేవారు. మెస్సీ తండ్రి అతని చికిత్సను కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే భరించగలిగాడు. ఆ తరువాత ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. మరోవైపు న్యూవెల్స్ ఓల్డ్ బాయ్స్ ఫుట్‌బాల్ క్లబ్ అతని చికిత్స కోసం డబ్బులు చెల్లించడాన్ని నిరాకరించింది. చాలా క్లబ్‌లు మెస్సీని వదులుకున్నాయి. కొద్ది కాలం తరువాత బార్సిలోనా జట్టు డైరెక్టర్ చార్లీ రెక్సాచ్ మెస్సీ గురించి ఆరా తీశాడు. తగు శిక్షణ అందేలా చూశాడు. బార్సిలోనా క్లబ్ తరుపున ఆడేందుకు మెస్సీతో 2000 డిసెంబర్ 14న తొలి ఒప్పందం చేసుకున్నాడు.

కొత్త అధ్యయనానికి నాంది

2001 ఫిబ్రవరిలో మెస్సీ, అతని కుటుంబం స్పెయిన్‌కు మకాం మార్చారు. అప్పటికి మెస్సీకి 13 ఏళ్లు. అతడు ఇక్కడ కొత్త సమస్యలను ఎదుర్కొన్నాడు. విదేశీ ఆటగాళ్లకు సంబంధించిన కొన్ని నిబంధనల కారణంగా మొదటి సంవత్సరంలో చాలా అరుదుగా ఫుట్‌బాల్ ఆడాడు. 2002లో మెస్సీ పేరు రాయల్ స్పానిష్ ఫుట్‌బాల్ ఫెడరేషన్‌లో నమోదు చేయబడింది. ఇతర ఫుట్‌బాల్ ఆటగాళ్లతో పోల్చినప్పుడు మెస్సీ చాలా పొట్టిగా ఉన్నందున అతని సహచరులు అతన్ని చూసి చాలా ఆశ్చర్యపోయేవారు. మెస్సీ మైదానంలో ఆడటం చూసి వారి సందేహాలన్నీ తీరాయి. మెస్సీకి తన ఎత్తు తన లోపమని తెలుసు కాబట్టి అతను తన లోపాన్ని భర్తీ చేయడానికి చాలా కష్టపడి ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేశాడు.

అంతర్జాతీయ ఆరంగేట్రం ఇలా..

2005 ఆగస్టు 17న హంగేరీతో జరిగిన స్నేహపూర్వక మ్యాచ్‌లో మెస్సీ తన మొదటి అంతర్జాతీయ ఆరంగేట్రం చేశాడు. అనతికాలంలోనే బార్సిలోనా క్లబ్ ర్యాంకుల్లోకి ఎదిగాడు. ఇక వెనుదిరిగి చూసుకోలేదు. ఫుట్‌బాల్ కెరీర్‌లో లెక్కలేనన్ని విజయాలు సాధించాడు. అర్జెంటీనా నెదర్లాండ్స్‌లో జరిగిన 2005 ఫిఫా వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకుంది. ఆ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ఆటగాడు మెస్సీనే. ఆరు గోల్స్ చేసి గోల్డెన్ బాల్, షూ రెండింటినీ గెలుచుకున్నాడు. 2007 మార్చి 10న తన మొదటి హ్యాట్రిక్ సాధించాడు. చైనాలోని బీజింగ్‌లో జరిగిన 2008 సమ్మర్ ఒలింపిక్స్‌లో ఒలింపిక్ బంగారు పతకాన్ని కూడా గెలుచుకున్నాడు. 2012లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక గోల్స్ కొట్టి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించాడు. ఆ ఒక్క ఏడాదే అతడు మొత్తం 91 గోల్స్ చేశాడు. మారడోనా కాలం తరువాత కొద్ది కాలం పాటు నిస్తేజంగా ఉన్న అర్జెంటీనాకు కొత్త ఊపిరిలూదాడు. తను ఆడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ బలమైన జట్టుగా తీర్చిదిద్దాడు. 2009, 2010, 2011, 2012, 2015 సంవత్సరాల్లో వరల్డ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నాడు. ప్రతిష్టాత్మకమైన ఏడు బాలన్ డిఓర్ అవార్డులను కైవశం చేసుకున్నాడు. మెస్సీ క్లబ్, తాను ఆడిన దేశం కోసం 793 గోల్స్ చేసి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. ఫుట్‌బాల్ ప్రపంచంలోని దాదాపు అన్ని రికార్డులనూ అతడు ముద్దాడాడు.


చే గువేరా, మారడోనా అంటే ఎనలేని ప్రేమ

ప్రపంచ విప్లవకారుడు, యూత్ ఐకాన్ చే గువేరా, ఫుట్‌బాల్ దిగ్గజం మారడోనా అంటే మెస్సీకి ఎనలేని ప్రేమ. ఇదే విషయాన్ని 2011లో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతడు గుర్తు చేశాడు. 'ఎక్కడైనా చే గువేరా, మారడోనా బొమ్మలతో కూడిన చొక్కాలను చూసినప్పుడు నేను చాలా సంతోషిస్తాను. అందమైన అనుభూతికి లోనవుతాను. మారడోనా, చే గువేరాలు గొప్ప వ్యక్తులు' అని మెస్సీ చెప్పుకొచ్చాడు.

- కోడూరు అప్పలనాయుడు,
94915 70765

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి





18 చుక్కలు 2 వరుసలు,
2 వచ్చేవరకు (సరిచుక్క)
సి రాజ్యలక్ష్మి,
ఎఎస్ రావు నగర్,
హైద్రాబాద్

'నువ్వు శ్రీదేవీ.. నేనే చిరంజీవి..' పాట విడుదల

చిరంజీవి బాబీ డైరెక్షన్‌లో నటిస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. శ్రుతి హాసన్ ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమాలో తాజాగా రెండో పాటను విడుదలచేశారు. ఈ విషయాన్ని మైత్రి మూవీ మేకర్స్ ట్విటర్ ద్వారా వెల్లడించింది. ఈ పాటను ఫ్రాన్స్‌లోని మంచుకొండల్లో కొద్ది రోజుల క్రితమే షూట్ చేశారు. 'నువ్వు సీతవైతే.. నేనే రామున్నంట అంటూ సాగిన ఈ పాటలో నువ్వు శ్రీదేవి అయితే.. నేనే చిరంజీవినంట... రాయే రాయే చేసేద్దాం రబ్బో అంటూ ముగింపు ఇచ్చారు.





త్వరలో సెకండ్ గ్లింప్స్

ప్రస్తుతం పవన్ హరిహర వీరమల్లు సినిమాలో పవన్‌కళ్యాణ్ నటిస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన సెకండ్ గ్లింప్స్‌కు సంబంధించిన అప్‌డేట్ త్వరలోనే రాబోతున్నట్లు సమాచారం. ఇటీవలే రిలీజైన గ్లింప్స్‌కు అభిమానుల నుంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో సెకండ్ గ్లింప్స్‌ను డిసెంబర్ 31న రిలీజ్ చేయాలని సన్నాహాలు చేస్తుంది.పదిహేడవ శతబ్దం నాటి మొగలాయిలు, కుతుబ్‌షాహీల కాలం నాటి కథాంశంతో ఈ సినిమా తెరకెక్కుతుంది. చిత్రంలో పవన్‌కు జోడీగా నిధి అగర్వాల్, నర్గీస్ ఫక్రీ నటిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏఎం.రత్నం. ఏ దయాకర్ రావు అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

31న 'ఖుషీ' రీ రిలీజ్

పవన్ కళ్యాణ్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన చిత్రం 'ఖుషీ'. ఈ చిత్రం ఇప్పుడు మళ్లీ విడుదలకు సిద్ధం అవుతోంది. డిసెంబర్ 31న థియేటర్లలో సందడి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హీరోయిన్‌గా భూమికా చావ్లా నటించారు. ఎస్. జే సూర్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. మణిశర్మ సంగీతం అందించారు.




సిఎంగా మోహన్‌లాల్!

శంకర్ డైరెక్షన్‌లో రాంచరణ్ చేస్తున్న ఆర్‌సి–15 సినిమాలో మళయాళ నటులు మోహన్ లాల్ కూడా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో ఆయన పాత్ర లీక్ అయ్యింది. ఈ చిత్రంలో మోహన్ లాల్ సీఎంగా కనిపించనున్నారు. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2023 సమ్మర్‌లో పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. కియరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు.



ఆయనతో జాగ్రత్తగా ఉండు చిన్మయి



కోలీవుడ్ నిర్మాత, రచయిత వైరాముత్తు ప్రవర్తనపై మరోసారి ఆరోపణలు చేశారు గాయని చిన్మయి. మొదట ఆయన గొప్ప వ్యక్తిగానే వ్యవహరిస్తాడని, తర్వాత ఇబ్బందులకు గురిచేస్తాడని అన్నారు. ఆయనతో జాగ్రత్తగా ఉండాలంటూ యువ నటి అర్చనకు సూచించారు. ఇటీవల తాను వైరాముత్తును కలిశానంటూ అర్చన ఫొటోలు షేర్ చేయగా వాటిపై చిన్మయి స్పందిస్తూ 'ఇలాగే మొదలవుతుంది. దయచేసి అప్రమత్తంగా ఉండు. వీలైనంత వరకూ దూరం పెట్టు. అలాగే, నీ పక్కన వేరే వ్యక్తులు లేకుండా ఒక్కదానివే వెళ్లి ఆయనను ఎప్పటికీ కలవకు' అని అన్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తమిళంలో తెరకెక్కిన 'రాజా రాణీ' అనే ధారావాహికతో ప్రేక్షకులకు చేరువైన అర్చన ఓ సినిమా షూట్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలో అక్కడే సెట్‌లో ఉన్న వైరాముత్తుని కలిసి ఫొటోలు దిగారు.



నయా చరిత్ర

ప్రతి నాకౌట్ మ్యాచ్‌లోనూ మెస్సీ గోల్

(ప్రజాశక్తి స్పోర్ట్స్‌డెస్క్)

అర్జెంటీనా స్టార్ ఆటగాడు, కెప్టెన్ లియోనెల్ మెస్సీ 2022 ఫిఫా ప్రపంచకప్‌లో నయా చరిత్రను నెలకొల్పాడు. ఈ ఏడాది జరిగిన ప్రపంచకప్‌లో అర్జెంటీనా తరఫున ప్రతి నాకౌట్ మ్యాచ్‌లోనూ గోల్ ఈ రికార్డును నమోదు చేశాడు. లూసైల్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో ఫ్రాన్స్‌పై 23వ ని.లో పెనాల్టీని గోల్‌గా మలచడంతో ఈ రికార్డు మెస్సీ సొంతమయింది. మొత్తంగా ఫైనల్ మ్యాచ్‌లో మెస్సీ రెండు గోల్స్ కొట్టడంతోపాటు పెనాల్టీ షూటౌట్‌లోనూ తొలి ప్రయత్నంలోనే గోల్ కొట్టి ఫ్రాన్స్‌పై ఒత్తిడి పెంచాడు. సెమీఫైనల్లో క్రొయేషియాపై 34వ ని.లో జట్టుకు లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచడంతో ఆ మ్యాచ్‌లో అర్జెంటీనా 3–0 గోల్స్‌తో విజయం సాధించింది. ఇక క్వార్టర్‌ఫైనల్లో నెదర్లాండ్స్‌పై రెండో అర్ధభాగం 73వ ని.లో పెనాల్టీని గోల్‌గా మలిచాడు. ఈ మ్యాచ్ 2–2తో డ్రా అయినా.. పెనాల్టీ షూటౌట్‌లో అర్జెంటీనా 4–3తో గెలిచింది. అలాగే ప్రి క్వార్టర్‌ఫైనల్లో ఆస్ట్రేలియాపై 35వ ని.లో గోల్ కొట్టి 2–1తో అర్జెంటీనా గెలుపునకు దోహదపడ్డాడు. ఇక 2022 ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనా జట్టుకు లభించిన ప్రతి పెనాల్టీని గోల్‌గా మలిచి మెస్సీ మరో రికార్డును నెలకొల్పాడు.

తొలి మ్యాచ్‌లోనే ఓటమితో రెట్టించిన ఉత్సాహంతో..

గ్రూప్–సి అర్జెంటీనా జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లోనే పసికూన సౌదీ అరేబియా చేతిలో 1–2గోల్స్ తేడాతో ఓటమిపాలైంది. దీంతో ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనాజట్టు ప్రదర్శనపై అభిమానులు తీవ్ర నిరాశ చెందారు. ఆ మ్యాచ్‌లో అర్జెంటీనా తరఫున నమోదైన ఏకైక గోల్‌ను మెస్సీ 10వ ని.లో పెనాల్టీ ద్వారా సాధించాడు. రెండో మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు 2–0తో మెక్సికోపై విజయం సాధించింది. ఆ గోల్‌ను మెస్సీ రెండో అర్ధభాగం 64వ ని.లో గోల్ కొట్టాడు. ఈ క్రమంలో ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పోలండ్‌పై గెలిస్తేనే సెమీస్ బెర్త్ దక్కుతుందనుకున్న దశలో అర్జెంటీనా 2–0తో గెలిచినా.. ఆ మ్యాచ్‌లో మెస్సీ ఒక్క గోల్‌నూ చేయలేదు. ఈ విజయంతో గ్రూప్–సి నుంచి అర్జెంటీనా 6పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి సెమీస్‌కు చేరగల్గింది. ప్రి క్వార్టర్స్ మ్యాచ్‌ల నుంచి మెస్సీ తన ఎడమకాలి మాయాజాలాన్ని ప్రదర్శించాడు. దీంతో అర్జెంటీనా జట్టు 34ఏళ్ల తర్వాత మూడోసారి ఫిఫా ప్రపంచకప్‌ను గెలుచుకుంది. దీంతో ఆ దేశ అభిమానులు రెండేళ్ల క్రితం మరణించిన దిగ్గజ ఆటగాడు డిగో మారడోనాను మరోసారి గుర్తుచేసుకున్నారు.



ఫ్రాన్స్ స్ట్రయికర్ బెంజెమా రిటైర్మెంట్

పారిస్: ఫ్రాన్స్ స్ట్రయికర్ కరీమ్ బెంజెమా(36) అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఫిఫా ప్రపంచకప్ పెనాల్టీ షూటౌట్‌లో ఫ్రాన్స్ జట్టు ఓటమితో బెంజెమా నిరాశ చెంది తన రాజీనామా విషయాన్ని ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. బెంజెమా 36వ జన్మదినోత్సవమైన సోమవారం రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. 2007లో ఫ్రాన్స్ తరఫున అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అరంగేట్రం చేసిన బెంజెమా 97మ్యాచుల్లో 37గోల్స్ కొట్టాడు. 2015లో సెక్స్–టేప్ కేసులో బ్లాక్ మెయిల్‌కు పాల్పడినట్లు ఋజువు కావడంతో ఆ దేశ ఫుట్‌బాల్ సమాఖ్య బెంజెమాపై ఐదేళ్ల నిషేధం విధించింది. 2021లో తిరిగి పునారాగమనం చేసిన బెంజిమా యూరోపియన్ ఛాంపియన్‌షిప్ ప్రి క్వార్టర్స్‌లో ఏకంగా నాలుగు గోల్స్ కొట్టినా ఫిఫా ప్రపంచకప్ ఫ్రాన్స్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు.

రెండో టెస్టుకూ రోహిత్ శర్మ దూరం

ఢాకా: బంగ్లాదేశ్‌తో గురువారం నుంచి ప్రారంభం కానున్న రెండో టెస్ట్‌కూ కెప్టెన్ రోహిత్ శర్మ దూరమయ్యాడు. వన్డే సిరీస్‌లో భాగంగా మూడో వన్డేలో బొటన వ్రేలికి తీవ్ర గాయం కారణంగా తొలిటెస్ట్‌కు దూరమైన రోహిత్ ముంబయికి చేరుకొని చికిత్స తీసుకుంటున్నాడు. గాయం తీవ్రంగా ఉండడంతో చటోగ్రామ్‌లో జరిగిన తొలి టెస్టులో దూరమయ్యాడు. రెండో టెస్ట్‌కైనా కోలుకొంటాడని ఆశించినా.. గాయం తగ్గకపోవడంతో రెండో టెస్ట్‌కూ రోహిత్ దూరమైనట్లు బిసిసిఐ సోమవారం ట్విటర్‌లో వెల్లడించింది. తొలి టెస్ట్‌లో భారత్ 188 పరుగుల తేడాతో విజయం సాధించి 1–0తో ఆధిక్యంలో నిలిచింది. రోహిత్ శర్మతోపాటు జస్ప్రీత్ బుమ్రా (వెన్నెముక గాయం), మహమ్మద్ షమీ (భుజం గాయం), రవీంద్ర జడేజా (మోకాలి గాయం) ఇప్పటికే జట్టుకు దూరమయ్యారు. అలాగే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్స్ పాయింట్ల పట్టికలో భారత్ రెండో స్థానానికి ఎగబాకింది.

గెలుపునకు చేరువలో ఇంగ్లండ్

పాకిస్తాన్‌తో మూడో టెస్ట్

కరాచీ: పాకిస్తాన్‌తో జరుగుతున్న మూడో, చివరి టెస్ట్‌లోనూ పర్యాటక ఇంగ్లండ్ జట్టు విజయానికి చేరువైంది. పాకిస్తాన్ నిర్దేశించిన 167పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లండ్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 112పరుగులు చేసింది. ఇంగ్లండ్ గెలుపు మరో 55పరుగులు కావాల్సి ఉంది. ఓవర్ నైట్ స్కోర్ వికెట్లేమీ నష్టపోకుండా 21పరుగులతో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్ జట్టు రేహాన్ రషీద్(5/48), లీచ్(3/72) దెబ్బకు 216పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ బాబర్ అజామ్(54), షాద్ షకీల్(53) అర్ధసెంచరీలతో రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లోనూ 51పరుగులు వెనుకబడ్డ కారణంగా ఇంగ్లండ్ ముందు 167పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగల్గింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 112పరుగులు చేసింది. మరో 55పరుగులు చేస్తే మూడు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంగ్లండ్ 3–0తో క్లీన్‌స్వీప్ చేయనుంది. డక్కెట్(50), కెప్టెన్ స్టోక్స్(10) క్రీజ్‌లో ఉన్నారు.



రేహాన్ రషీద్(5/48)ను అభినందిస్తున్న ఇంగ్లండ్ ఆటగాళ్లు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68